కలం నిఘా

WWW.KALAMNIGHA.COM

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ : సోమవారం 12 ఆగస్టు 2024

సంపుటి: 14, సంచిక: 129, పేజీలు 8, వెల: 4.00

Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam


# రైతులకు గుడ్ న్యూస్..

## 109 రకాల పంటల వంగడాలను విడుదల చేసిన ప్రధాని



న్యూఢిల్లీ ఆగస్టు 11 (నిఘా న్యూస్) వ్యవసాయ ఉత్పాదకత, రైతుల ఆదాయాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం సరికొత్త విత్తనాలను విడుదల చేశారు. వ్యవసాయ, ఉద్యానవన -వివరాలు2లో

# హిండెన్‌బర్గ్‌కు సెబీ ఛైర్‌పర్సన్ షోకాజు నోటీసులు




2

# బంగ్లాదేశ్‌లో.. హిందువులపై దాడి

## మైనారిటీలకు పార్లమెంటులో 10 శాతం సీట్లు కేటాయించాలి

- షేక్ హసీనా రాజీనామా అనంతరం హిందువులే లక్ష్యం
- దాడులను నిరసిస్తూ లక్షలాది మంది నిరసన
- మైనారిటీలకు రక్షణగా కొత్త చట్టాలు తేవాలి
- పలుచోట్ల ఆలయాల ధ్వంసం
- దాడులను తట్టుకోలేక భారత్‌కు వెళ్లేందుకు ప్రయత్నం
- హిందువులకు మద్దతుగా విదేశాల్లోనూ నిరసనలు
- దాడులను ఖండించిన బంగ్లా ప్రధాని

న్యూఢిల్లీ ఆగస్టు 11 (నిఘా న్యూస్) బంగ్లాదేశ్‌లో లక్షలాది మంది హిందువుల ర్యాలీ, దాడులను నిరసిస్తూ రోడ్లపై నినాదాలు బంగ్లాదేశ్‌లోని హిందువులు భారీ ర్యాలీ నిర్వహించారు. తమపై జరుగుతున్న దాడులపై నిరసన వ్యక్తం చేశారు. షేక్ హసీనా రాజీనామా చేసి వెళ్లిపోయిప్పటి నుంచి ఆందోళనకారులు హిందువులే లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్నారు. పలు చోట్ల ఆలయాలు ధ్వంసం చేశారు. హిందువు ఇళ్లలోకి చొరబడి విధ్వంసం సృష్టించారు. అప్పటి నుంచి తీవ్ర అసహనంతో ఉన్న హిందువులు ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చారు. బంగ్లాదేశ్ రాజధాని ధాకాతో పాటు చిట్టగాంగ్‌లో లక్షలాది మంది హిందువులు ర్యాలీ చేశారు. పలు జిల్లాల్లో వీళ్లపై దాడులు జరుగుతున్నాయి. వేలాది మంది హిందువులు ఈ దాడులు తట్టుకోలేక భారత్‌కి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. హిందువులపై దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ -వివరాలు2లో




## బంగ్లా పాపం... అమెరికాదే



సెయింట్ మార్టిన్ ద్వీపాన్ని అమెరికాకు అప్పగించనందునే అగ్రరాజ్యం దుశ్చర్య

షేక్ హసీనా సంచలన వ్యాఖ్యలు 2



# హైదరాబాద్ అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరణ

## ఏఐ ఆధారిత డేటా సెంటర్‌పై చర్చలు

### అమెరికా పర్యటనలో కంపెనీ ప్రతినిధులతో సంప్రదింపులు

హైదరాబాద్, ఆగస్టు 11 (నిఘా న్యూస్) పెట్టుబడులే ప్రధాన లక్ష్యంగా విదేశీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి బృందం.. బిజీ బిజీగా గడుపుతోంది. పెద్ద పెద్ద కంపెనీల ప్రతినిధులతో సమావేశమవుతూ.. పెట్టుబడులు తీసుకొచ్చే ప్రయత్నాల్లో సఫలమవుతోంది రేవంత్ బృందం. ఇప్పటికే పలు కంపెనీలు.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబర్చగా.. ఇప్పటికే హైదరాబాద్‌లో పెట్టుబడి పెట్టిన కంపెనీ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమెజాన్ కంపెనీ హైదరాబాద్‌లో తన డేటా సెంటర్‌ను విస్తరించేందుకు.. ఆసక్తి ప్రదర్శించింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్ ప్లానింగ్ అండ్ డెలివరీ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్, కంపెనీ ప్రతినిధి బృందంతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. తెలంగాణలో డేటా సెంటర్ కార్యకలాపాలపై చర్చలు జరిపారు. ఇప్పటికే తెలంగాణలో అమెజాన్ కంపెనీ కార్యకలాపాలను విస్తరించింది. ప్రపంచంలోనే అమెజాన్ కంపెనీకి చెందిన అతిపెద్ద కార్పొరేట్ భవనం హైదరాబాద్ నగరంలో ఉంది. అయితే.. గతేడాది అమెజాన్ డెడికేటేడ్ -వివరాలు2లో

# ఉత్తర భారతంలో భారీ వర్షాలు

## 28 మంది మృతి



న్యూఢిల్లీ ఆగస్టు 11 (నిఘా న్యూస్) ఉత్తర భారంలో భారీ వర్షాలకు సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీతో పాటు పంజాబ్, రాజస్థాన్, హర్యానా సహా పలు ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు -వివరాలు2లో

# ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ స్పీకర్ రిక్వెస్టు



హైదరాబాద్, ఆగస్టు 11 (నిఘా న్యూస్) తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, తిరుమల వేంకటేశ్వర ఆలయం సహా దేవస్థానం పరిధిలోని ఆలయాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ సీఎంకు తెలంగాణ -వివరాలు2లో

# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

## ఐదుగురు ఏపీ విద్యార్థుల మృతి



తిరువళ్లూరు. ఆగస్టు 11 (నిఘా న్యూస్) తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా రామంజేరిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కంటైనర్ ట్రక్కును ఎదురుగా వచ్చి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు విద్యార్థులు మృతి చెందారు. మరో ఇద్దరికి -వివరాలు2లో



# కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ గేటు

## లక్ష క్యూసెక్కుల నీరు వృథా.. చంద్రబాబు ఆరా

హైదరాబాద్, ఆగస్టు 11 (నిఘా న్యూస్) కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్ గేటు విరిగి కొట్టుకుపోయింది. శనివారం రాత్రి 11 గంటలకు హెూస్పేట వద్ద తుంగభద్ర డ్యామ్‌లో వరద తగ్గడంతో గేట్లను మూసివేస్తున్న క్రమంలో 19వ గేటు చైన్ లింక్ తెగి కొట్టుకుపోయింది. దీంతో డ్యామ్ నుంచి నీరు ఏకధాటిగా దిగువకు ప్రవహిస్తూనే ఉంది. ఇప్పటివరకు లక్ష క్యూసెక్కులకుపైగా నీరు వృథాగా కిందికి పోయిందని అధికారులు పేర్కొన్నారు. ఈ ఒక్క గేటు విరిగి కొట్టుకుపోవడంతో.. తుంగభద్ర డ్యామ్ నుంచి 60 టీఎంసీల నీరు వృథాగా పోనుందని తెలిపారు. మరోవైపు.. షిమోగలో కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఇక తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడంతో నీరు దిగువకు వరదలాగా ప్రవహిస్తుండటంతో అధికారులు అలర్ట్ అయ్యారు. నదీపరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేశారు. వరద నేపథ్యంలో -వివరాలు2లో

# సీతారామ ప్రాజెక్టు పంపుల ట్రయల్ రన్



## నిర్వహించిన మంత్రులు

### ఏటా 10 లక్షల ఎకరాలకు నీరు

### మంత్రి ఉత్తమ్

భద్రాద్రి, ఆగస్టు 11 (నిఘా న్యూస్) తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్విచ్ ఆన్ చేసి సీతారామ ప్రాజెక్టు పంపుల ట్రయల్ రన్ ప్రారంభించారు. సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్-2ను మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. భద్రాద్రి సీతారామ ప్రాజెక్టుతో ఏటా 10 లక్షల ఎకరాలకు నీరు అందించనున్నట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. గోదావరి జలాలతో భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆగస్టు 15న ప్రాజెక్టు 2, 3 లిఫ్ట్ ఇరిగేషన్లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఏడాది ఆగస్టు 15 నాటికి ఆయకట్టులోని ప్రతి ఎకరానికి నీరందిస్తామని చెప్పారు. ఇటీవల చెప్పినట్లుగానే అదేరోజు -వివరాలు2లో



# రైతు బాగుంటేనే.. రాష్ట్రం బాగుంటుంది

## గుర్తుపెట్టుకోండి చంద్రబాబూ.. వైఎస్ జగన్ ట్వీట్

అమరావతి, ఆగస్టు 11 (నిఘా న్యూస్) ఏపీ రైతుల పట్ల చంద్రబాబు నిర్లక్ష్యం వహిస్తుందని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. సకాలంలో నిర్ణయాలు తీసుకోకపోవడంతో రైతులకు నష్టం వాటిల్లుతుందని ఆరోపించారు. రైతు బాగుంటేనే .. రాష్ట్రం బాగుంటుందని -వివరాలు2లో

# దువ్వాడ ఫ్యామిలీ గొడవలో ట్విస్ట్

## టోల్‌గేట్ వద్ద మాధురి కారు బోల్తా

పలాస, ఆగస్టు 11 (నిఘా న్యూస్) గత మూడు రోజులుగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం మలుపులు తిరుగుతోంది. ఈ క్రమంలో ఆదివారం ఊహించని ట్విస్ట్ చోటు చేసుకుంది. దువ్వాడ శ్రీనివాస్‌కు సంబంధించి ఆయన భార్య దువ్వాడ వాణి నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న దివ్వెల మాధురి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆదివారం మధ్యాహ్నం దువ్వాడ శ్రీను -వివరాలు2లో



# అనుకున్న సమయం కంటే ముందుగానే భోగాపురం ఎయిర్ పోర్టు

పనులు 36.6 శాతం పూర్తి

ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చే శక్తీ

రైల్వేజోన్ ఏర్పాటుకు కేంద్రం సానుకూలం

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



2



## రైతులకు గుడ్ న్యూస్..

మొదటి పేజీ తరువాయి

పంటల్లో అధిక దిగుబడినిచ్చే, రకరకాల వాతావరణల పరిస్థితిని తట్టుకునేలా ఈ బయోఫోర్టిఫైడ్ విత్తనాలను తయారు చేశారు. ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో అధిక దిగుబడినిచ్చే 109 రకాల పంటల వంగడాలను ప్రధాని మోదీ విడుదల చేశారు. 109 రకాల వంగడాలలో 61 పంటల్లో 34 క్షేత్ర పంటలు, 27 ఉద్యాన పంటలు ఉన్నాయి. ఈ విత్తనాల్లో.. పొలాల్లో పండే పంటల విషయానికొస్తే.. మినుము, నూనెగింజలు, చిక్కుడు, చెరకు, పత్తి సహా ఇతర పంటలు ఉన్నాయి. అలాగే ఉద్యాన పంటల విషయానికొస్తే, వివిధ రకాల పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, పువ్వులు, ఔషధ పంటలు ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రైతులతో పాటు శాస్త్రవేత్తలతో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని వారితో పలు అంశాలపై చర్చించారు. ఇక షకాహార లోపం లేని భారతదేశాన్ని రూపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల వంటి అనేక ప్రభుత్వ కార్యక్రమాలతో అనుసంధానం చేయడం ద్వారా బయో ఫోర్టిఫైడ్ రకాల పంటలను ప్రోత్సహించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది. దీంతో రైతులకు మంచి ఆదాయం రావడంతోపాటు పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు లభిస్తాయని కేంద్రం అంచానవేస్తోంది.

## హైదరాబాద్ అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరణ

మొదటి పేజీ తరువాయి

ఎయిర్ కార్గో నెట్‌వర్క్ "అమెజాన్ ఎయిర్" ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే.. అమెజాన్ వెబ్ సర్వీసెస్‌కు సంబంధించి హైదారాబాద్‌లో మూడు డేటా సెంటర్లు ఇప్పటికే పనిచేస్తున్నాయి. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ఆధారిత సేవలతో కొత్త హైపర్ స్కేల్ డేటా సెంటర్‌తో పాటు తమ వ్యాపారాన్ని విస్తరించే ఆలోచనలను ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు పంచుకున్నారు. ఈ సందర్భంగా.. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అమెజాన్‌తో చర్చలు విజయవంతమయ్యాయని ప్రకటించారు. ప్రభుత్వం తరఫున తగినంత సహకారంతో పాటు ఉత్తమమైన ప్రోత్సాహకాలు అందిస్తామని వారికి హామీ ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్రంలో భారీ విస్తరణకు కంపెనీ ముందుకు వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో తమ క్లౌడ్ సదుపాయాలను మరింత విస్తరించే అవకాశాలపై ఆనందం వ్యక్తం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ సేవల వృద్ధికి హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ వృద్ధిలో ఆశించిన లక్ష్యాలను అందుకునేందుకు తమ కంపెనీ భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందని తెలిపారు.

## కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ గేటు

మొదటి పేజీ తరువాయి

సురక్షితంగా ఉండాలని సూచించారు. ఈ క్రమంలోనే తుంగభద్ర నుంచి సుంకేసుల ప్రాజెక్టుకు ఏకంగా లక్ష క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఇక్కడ కూడా అధికారులు అలర్ట్ అయ్యారు. తుంగభద్ర గేటు మరమ్మతులు పూర్తి చేసే వరకు సుంకేసుల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగనుందని అధికారులు వెల్లడించారు. వరద ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు అడ్డంకిగా మారిందని చెప్పారు. తుంగభద్రలో వరద తగ్గాక అధికారులు మరమ్మతులు చేపట్టి.. విరిగిపోయిన గేటు స్థానంలో కొత్తది ఏర్పాటు చేయనున్నారు. అయితే ఎగువ నుంచి వరద తగ్గడంతో డ్యాం గేట్లను మూసివేసే సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుందని అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు నుంచి 60 టీఎంసీల నీళ్లు బయటికి వదిలిన తర్వాతే గేటు పునరుద్ధరణ పనులు చేపడతామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం 33 గేట్లు తెరిచి నీటిని కిందికి వదులుతున్నట్లు వివరించారు. డ్యామ్ భద్రతకు సంబంధించి ఇంత పెద్ద ఘటన జరగడం గత 70 ఏళ్లలో ఇదే మొదటిసారి అని అధికారులు పేర్కొన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కౌతాలం, కోసిగి, మంత్రాలయం, నందవరం మండాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు.. కర్ణాటకలో తుంగభద్ర డ్యామ్ గేటు విరిగిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ఘటనకు సంబంధించిన వివరాలను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అలర్ట్ చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. డ్యామ్‌లో 6 మీటర్ల ఎత్తు వరకు నీరు ఉందని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. స్టాప్‌లాక్ అరేంజ్‌మెంట్ ద్వారా నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరోవైపు తుంగభద్ర డ్యామ్ అధికారులతో మాట్లాడి.. తాత్కాలిక గేటు ఏర్పాటు చేసేలా చూడాలని మంత్రి పయ్యావుల కేశవ్‌కు సీఎం చంద్రబాబు సూచించారు. అయితే డ్యామ్ పాత డిజైన్ కావడం వల్ల స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉందని మంత్రి పయ్యావుల సీఎంకు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఘటనాస్థలికి ఇంజినీర్ల బృందం, సెంట్రల్ డిజైన్ కమిషనర్ వెళ్లినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు. కౌతాలం, కోస్గి, మంత్రాలయం, నందవరం ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. శ్రీశైలం, సాగర్, పులిచింతల ప్రాజెక్టుల అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటి పేజీ తరువాయి

గాయాలయ్యాయి. మృతులంతా ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన వారిగా గుర్తించారు. అయితే వీరంతా చెన్నై లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంజినీరింగ్ థర్డ్ ఇయర్ చదువుతున్నట్లు తెలిసింది. ఒంగోలు నుంచి తిరువళ్లూరుకు విద్యార్థులు వెళ్తుండగా చెన్నైకు 65 కిలో మీటర్ల దూరంలో ప్రమాదానికి గురయ్యారు. మృతులు నితీశ్ వర్మ, చేతన్ , యుగేశ్, నితీశ్, రామ్మోహన్ రెడ్డిగా క్షతగాత్రులు చైతన్య, విష్ణుగా గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుల మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. మృతుల కుటుంబాలకు సమాచారం అందజేశారు. అతివేగమే ప్రమాదానికి కారణమని అంచనా వేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బంగ్లా పాపం... అమెరికాదే

న్యూఢిల్లీ ఆగస్టు 11 (నిఘా న్యూస్) బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా సంచలన ఆరోపణలు గుప్పించారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం చోటు చేసుకున్న అస్థిరత, అల్లర్లు ఆందోళనలతోపాటు.. తన ప్రభుత్వం పడిపోవడానికి అమెరికా కారణం అని ఆమె ఆరోపించారు. అయితే అమెరికా ఈ దుస్సాహసానికి పాల్పడటానికి వెనుక ఒక బలమైన కారణం ఉందని తెలిపారు. బంగాళాఖాతంలో తన ఆధిపత్యాన్ని చాటుకునేందుకు వీలుగా ఉన్న సెయింట్ మార్టిన్ ద్వీపాన్ని తాను అమెరికాకు అప్పగించనందునే అగ్రరాజ్యం ఇంతటి దుశ్చర్యకు పాల్పడిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఛాందసవాదుల మాటలు విని తప్పుదోవపట్టొద్దని ఈ సందర్భంగా బంగ్లాదేశ్ ప్రజలకు షేక్ హసీనా విజ్ఞప్తి చేశారు. ఆందోళనకారులు ఢాకాలోని తన అధికారిక నివాసాన్ని చుట్టుముట్టడంతో విధిలేని పరిస్థితుల్లో ఆర్మీ హెలికాప్టర్‌లో అక్కడి నుంచి వచ్చి భారత్‌లో తలదాచుకుంటున్న షేక్ హసీనాకు ఇతర దేశాల్లో ఆశ్రయం దొరక్క పోవడంతో ఢిల్లీలోనే ఉంటున్నారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తమ ప్రభుత్వ పతనానికి అమెరికానే కారణమని తాజాగా ఆరోపించారు. బంగాళాఖాతంలో అమెరికా ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తుంటే దానికి, బంగ్లాదేశ్ ప్రధానిగా ఉన్న తాను అడ్డుకోవడంతోనే అమెరికా ఈ పన్నాగం పన్నినట్లు షేక్ హసీనా పేర్కొన్నారు. బంగాళాఖాతంలోని సెయింట్ మార్టిన్ ద్వీపాన్ని అమెరికాకు తాను అప్పగించనందుకే ప్రధాని పదవి నుంచి తనను తప్పించారని ఆమె హసీనా ఆరోపించారు. ఛాందసవాదుల వల్ల బంగ్లాదేశ్ వాసులు తప్పుదోవ పట్టవద్దని శాంతంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అయితే బంగ్లాదేశ్‌లో హింసను ఆపడానికే తాను, అక్కడి నుంచి విదేశాలకు వచ్చినట్లు షేక్ హసీనా తెలిపారు. తాను బంగ్లాదేశ్ ప్రజల మృతదేహాలను చూడకుండా ఉండటానికి ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసినట్లు వివరించారు. బంగ్లాదశ్ విద్యార్థుల మృతదేహాలపై కొందరు అధికారంలోకి రావాలని కోరుకున్నారని, కానీ దానికి తాను అంగీకరించలేదని షేక్ హసీనా స్పష్టం చేశారు. సెయింట్ మార్టిన్ దీవి సార్వభౌమాధికారాన్ని అమెరికాకు అప్పగించి బంగాళాఖాతంలో తన ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు అనుమతి ఇచ్చి ఉంటే, తాను బంగ్లాదేశ్ ప్రధాని పీఠంపై ఉండేదాన్నని కానీ తాను అలా చేయలేదని తన దేశ ప్రజలను అభ్యర్థిస్తున్నానని షేక్ హసీనా పేర్కొన్నారు. తాను ఇంకా ఎక్కువ సేపు బంగ్లాదేశ్‌లో ఉంటే మరింత మంది ప్రాణాలు పోయేవని మరిన్ని దేశ వనరులు, ప్రజల ఆస్తులు దెబ్బతినేవని షేక్ హసీనా తెలిపారు. బంగ్లాదేశ్ ప్రజలు తనను ఎన్నుకున్నారని.. కాబట్టి వారికి తాను నాయకురాలిని అయ్యానని. వాళ్లే తన బలం అని చెప్పారు. తన పార్టీ అవామీ లీగ్‌కు చెందిన పలువురు నాయకులు హత్యకు గురయ్యారని, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని.. వాళ్ల ఇళ్లను తగులబెట్టారని వస్తున్న వార్తలు చూస్తుంటే తన గుండె రోదిస్తోందని చెప్పారు. అల్లా దయతో తాను త్వరలోనే బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తానని సవాళ్లతో పోరాడిన తర్వాత అవామీ లీగ్ పార్టీని మళ్లీ నిలబడేలా చేస్తానని షేక్ హసీనా హామీ ఇచ్చారు. బంగ్లాదేశ్ భవిష్యత్తు కోసం తాను అల్లాను ప్రార్థిస్తున్నానని తన తండ్రి షేక్ ముజీబుర్ రెహమాన్ కలలు కన్న దేశమన నా తండ్రితోపాటు కుటుంబ సభ్యులు ప్రాణాలు అర్పించిన దేశమని మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

# సీతారామ ప్రాజెక్టు పంపుల ట్రయల్ రన్

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేసి తీరుతామన్నారు. రీడిజైన్ పేరుతో బీఆర్ఎస్ హయాంలో రూ.8 వేల కోట్లు వృథా చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రెండు దఫాలు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా, సీతారామ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగాయన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. జూలూరుపాడు టన్నెల్ పూర్తయితే పాలేరు వరకు గోదావరి జలాలు వస్తాయన్నారు. పంప్ హౌస్‌ల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కాలువలు త్వరగా పూర్తి చేస్తామన్నారు. మొదటి పంపు హౌజ్ ట్రయల్ రన్‌ను గత జూన్‌లో విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపారు. రెండో పంపు హౌజ్ ట్రయల్ రన్‌ను జులై 2న విజయవంతంగా నిర్వహించినట్టు వెల్లడించారు. రైతుల కష్టాలు ఇకపై తొలగిపోయాతాయని అన్నదాతల కళ్లల్లో ఆనందాన్ని చూడడమే తమ లక్ష్యమన్నారు. రాజీవ్ నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, ఇందిరా సాగర్‌లను ఒకే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌గా విలీనం చేసి భద్రాద్రి సీతారాముడి పేరు మీదుగా సీతారామ ఎత్తిపోతల పథకంగా ప్రభుత్వం పేరు మార్చింది. ఈ ప్రాజెక్టును స్వాతంత్ర దినోత్సవం రోజున సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. గోల్కొండ కోటలో జెండా ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నాక.. హెలికాప్టర్ ద్వారా ఖమ్మం జిల్లా వైరాకు రేవంత్ రెడ్డి చేరుకుంటారు. సీతారామ ప్రాజెక్టు పంపు హౌస్‌లను స్విచ్ఛాన్ చేసి



ప్రారంభిస్తారు. అనంతరం వైరాలో జరగనున్న బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు.

# దువ్వాడ ఫ్యామిలీ గొడవలో ట్విస్ట్



మొదటి పేజీ తరువాయి

స్నేహితురాలు, వైసీపీ నాయకురాలు దివ్వెల మాధురి కారు బోల్తా పడింది. ఆమె అతి వేగంతో కారును నడిపి, మరో వాహనాన్ని ఢీకొట్టడంతో మాధురి కారు బోల్తా పడినట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం జిల్లాలో మాధురి కారు రోడ్డు ప్రమాదం ఘటన హాట్ టాపిక్ గా మారింది. దివ్వెల మాధురికి స్వల్ప గాయాలు కాగా, సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పలాస మండలం లక్ష్మీపురం టోల్‌గేట్ సమీపంలో వేగంగా దూసుకొచ్చిన మాధురి కారు, ఆగి ఉన్న మరో కారును ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో దివ్వెల మాధురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల సాయంతో మాధురిని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గత మూడు, నాలుగు రోజులుగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఫ్యామిలీలో గొడవలు జరుగుతున్నాయి. దువ్వాడ వాణి తన భర్త ఇంటికి రాగా, ఆయన ఆమెను కలవాడానికి ఆసక్తి చూపలేదు. అంతకుముందు రోజు వాణి ఇద్దరు కుమార్తెలు దువ్వాడ శ్రీనివాస్ ఇంటి వద్దకు రాగా, గేట్లు కూడా తెరవలేదు. కొన్ని గంటలపాటు తన తండ్రిని కలుసుకునేందుకు వేచి చూసినా ఫలితం లేకపోయింది. దాంతో వారు చేసేదేమీ లేక రాత్రి వరకు ఎదురుచూసి తిరిగి వెళ్లిపోయారు. మరుసటి రోజు నుంచి తల్లి దువ్వాడ వాణితో కలిసి కుమార్తెలు హైందవి, మరో కుమార్తె దువ్వాడ శ్రీను ఇంటి వద్ద నిరసనకు దిగారు. ఈ క్రమంలో ఓపిక నశించి, దువ్వాడ శ్రీనివాస్ ఇంటి తలుపులు బద్ధలు కొట్టి లోపలికి వెళ్లే ప్రయత్నం సైతం చేశారు. అనంతరం దువ్వాడ వాణి మీడియాతో మాట్లాడుతూ.. తన భర్త దువ్వాడ శ్రీనివాస్ తనకు, తన కూతుళ్లకు అన్యాయం చేశారని ఆరోపించారు. గత కొంతకాల నుంచి దువ్వాడ పూర్తిగా మారిపోయారని, దివ్వెల మాధురి అనే మహిళతో సంబంధం పెట్టుకున్నారని అందుకే తమను పట్టించుకోవడం లేదన్నారు. పార్టీ నుంచి సైతం తనకు ఏ సహాయం అందడం లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం జగన్ స్పందించి వ్యక్తిగతంగా, పార్టీ పరంగా తనకు న్యాయం చేయాలని కోరారు. భార్యను, పిల్లల్ని దూరం పెట్టి తన ఇష్టానుసారంగా వేరే మహిళతో ఉంటున్న తన భర్త, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పై వైసీపీ అధినేత జగన్ చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ కోసం తాను ఎంతో చేశానని, కానీ ఈరోజు ఏ విధంగానూ మద్దతు దొరకడం లేదని దువ్వాడ వాణి ఆవేదన వ్యక్తం చేశారు. తన ఆస్తులను దువ్వాడ శ్రీను ఆయన కుటుంబసభ్యులు తీసుకున్నారని, కనీసం తమకు చెందాల్సిన ఆస్తులను దక్కించుకుంటామన్నారు. తన అత్త లీలావతి తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, దివ్వెల మాధురి తన భర్తతో కలిసి అసాంఘిక కార్యకలాపాలు చేస్తోందని.. ఇది ఎవరూ హర్షించరన్నారు. ఓ మహిళగా న్యాయపరంగా పోరాటం చేసి తన హక్కులను సాధించుకుంటానన్నారు. తమ కుటుంబంలో చిచ్చుపెట్టిన మహిళను వదిలే ప్రసక్తే లేదంటూ మాధురికి సైతం దువ్వాడ వాణి వార్నింగ్ ఇచ్చారు.

# ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ స్పీకర్ రిక్వెస్టు

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రిక్వెస్టు చేశారు. గత ప్రభుత్వంలో తెలంగాణకు చెందిన మంత్రులు, ప్రజా ప్రతినిధులు సిఫారసు లేఖలు ఇచ్చినా వాటిని తిరుమల తిరుపతి దేవస్థానం పరిగణనలోకి తీసుకోలేదని, భక్తులకు దర్శనాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. ఈసారి అలాంటి పరిస్థితి రిపీట్ కాకుండా తెలంగాణ ప్రజా ప్రతినిధులు (మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు) ఇచ్చే సిఫారసు లేఖలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఏపీ సీఎం చంద్రబాబును ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి కలిసి ఈ విషయంపై సుదీర్ఘంగా చర్చించగా సానుకూల స్పందన వచ్చింది. తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని చంద్రబాబు భావిస్తున్న తరుణంలో అసెంబ్లీ స్పీకర్ నుంచి ఈ రిక్వెస్టు వెళ్ళడం గమనార్హం. తెలంగాణ ప్రజలకు తిరుమల ఆలయంలో దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడానికి మార్గం సుగమమైంది. టీటీడీ బోర్డులో తెలంగాణ నుంచి ఇద్దరికి స్థానం లభించే అవకాశం కూడా ఉన్నది. ఏపీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉన్న సమయంలో తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను పట్టించుకోలేదు. ఇప్పుడు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారడంతో పాటు రెండు రాష్ట్రాల మధ్య సుహృద్భావ సంబంధాలు కొనసాగుతాయని ఇద్దరు ముఖ్యమంత్రులు ఓపెన్‌గా చెప్పినందున దర్శనాలకు రానున్న రోజుల్లో సమస్యలు ఉండవనే అభిప్రాయం నెలకొన్నది.

# రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది

మొదటి పేజీ తరువాయి

గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబుకు ఆదివారం ఎక్స్ వేదిక ద్వారా సూచించారు. 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంట బీమా ప్రీమియంను ఇప్పటివరకూ చెల్లించలేదు. దీనివల్ల రైతులకు ఉచిత పంటల బీమా చెల్లింపులు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. మా ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా ఏప్రిల్-మే నెలలో చెల్లించి నష్టపోయిన రైతులను జూన్‌లో ఆదుకున్నాం. ఖరీఫ్ పంట వేసే సమయానికి రైతులపై పైసా భారంపడకుండా ఉచిత పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి సమర్థవంతంగా అమలు చేశామని గుర్తు చేశారు.



రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించిన వెంటనే కేంద్రం కూడా వెంటనే తన వాటా కూడా విడుదలచేస్తుంది. ఇది జరిగిన సుమారు 30 రోజుల్లోగా బీమా కంపెనీ పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తుందని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 54.55 లక్షల మంది రైతులకు గతంలో ఎన్నడూలేని విధంగా రూ.7,802 కోట్లు అందించి అండగా నిలిచి, దేశంలో పలు రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలిచిందని వెల్లడించారు. ఈ సంవత్సరం కోస్తాలో అతివృష్టి, రాయలసీమలో కరువు వల్ల పంటల దెబ్బతినే ప్రమాదం నెలకొంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనతవల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఇప్పటికైనా మేలుకుని వెంటనే ఉచిత పంటల బీమా ప్రీమియం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

### సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాలి..

రైతుకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా సొమ్ము ఏటా రూ.20వేలు ఇస్తామని సూపర్ సిక్స్ హామీల్లో పేర్కొన్నారు. మీరిచ్చే పెట్టుబడి సహాయం కోసం రైతులంతా ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ దాదాపు పూర్తికావొస్తున్నా ఇప్పటివరకూ దీనిపై ఎలాంటి ప్రకటనా లేదని జగన్ ఆరోపించారు. మా ప్రభుత్వ హయాంలో కోవిడ్‌తో ప్రపంచ ఆర్థికవ్యవస్థలన్నీ కుదేలైనా క్రమం తప్పకుండా రైతులకు రైతు భరోసా అందించాం. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా సీజన్లో రైతు భరోసా చెల్లించాం. ఈ విధంగా 53.58 లక్షల మంది రైతులకు రూ.34,288 కోట్లు పెట్టుబడి సహాయం చేశామని పేర్కొన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి

మొదటి పేజీ తరువాయి

భారీ ర్యాలీ నిర్వహించారు. అంతే కాదు. పార్లమెంట్‌లో మైనార్టీలకు 10 శాతం సీట్లు కేటాయించాలనీ డిమాండ్ చేస్తున్నారు. మైనార్టీల హక్కులకు రక్షణ కల్పించేలా కొత్త చట్టాలు తీసుకు రావాలని నినదించారు. హిందువులకు మద్దతుగా వేలాది మంది ముస్లింలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. పలు చోట్ల రోడ్‌లు బ్లాక్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థులూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అక్కడి మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం దాదాపు 7 లక్షల మంది ఈ ర్యాలీ చేశారు. అటు అమెరికా, బ్రిటన్‌లోనూ ఇదే స్థాయిలో నిరసనలు వెల్లువెత్తాయి. ఈ ర్యాలీలపై ఆపద్ధర్మ ప్రధాని మహమ్మద్ యూనస్ స్పందించారు. హిందువులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. విద్యార్థులకు కీలక సూచనలు చేశారు. హిందువులు, ముస్లింలు, బౌద్ధులపై దాడులు జరగకుండా చూసుకోవాలని, వాళ్ల కుటుంబాల్ని రక్షించాలని కోరారు. వాళ్లూ ఈ దేశ పౌరులే అన్న విషయం మరిచిపోవద్దని అన్నారు. బంగ్లాదేశ్‌లో ఇంకా అల్లర్లు సద్దుమణగడం లేదు. దాదాపు నెల రోజులుగా అక్కడ ఘర్షణలు కొనసాగు తున్నాయి. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. విద్యార్థులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. షేక్ హసీనా ఇంటినీ ముట్టడించారు. వెంటనే ఆమె అక్కడి నుంచి ఇండియాకి వచ్చారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఈ అల్లర్లను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తోంది.

## ఉత్తర భారతంలో భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి

విరిగిపడిన ఘటనలు నమోదయ్యాయి. హర్యానాలోనైతే డ్యామ్ దెబ్బతిని అనేక గ్రామాలను ముంచెత్తింది. అమర్‌నాథ్ ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా యాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు జమ్మూ కాశ్మీర్ అధికారులు ప్రకటించారు. రాజస్థాన్‌లో అత్యధికంగా శని, ఆదివారాల్లో 16 మంది మరణించారు. తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. మొత్తంగా వర్షాల వల్ల జరిగిన ప్రమాదాల్లో ఆదివారం ఒక్కరోజే ఉత్తరాదిన మొత్తం 28 మంది ప్రాణాలను కోల్పోయారు. పలు ప్రాంతాల్లో భవనాలు ధ్వంసం అయ్యాయి. పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో ఆదివారం వరదల ప్రవాహానికి వాహనం కొట్టుకుపోవడంతో ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది సభ్యులతో సహా తొమ్మిది మంది మృతి చెందారు. ఢిల్లీలో భారీ వర్షాల వల్ల రహదారులపై నీటి ఎద్దడి, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. రోహిణి సెక్టార్ 20లోని అధికంగా నీరు చేరడంతో పార్కులో ఏడేళ్ల బాలుడు మునిగి చనిపోయినట్టు అధికారులు వెల్లడించారు. హిమాచల్ ప్రదేశ్‌లో సైతం గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదల కారణంగా 280కి పైగా రహదారులు మూసుకుపోయాయి. ముగ్గురు బాలికలు మృతి చెందగా, ఒకరు తప్పిపోయారు. హిమాచల్ ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, బీహార్, పంజాబ్, అస్సాం, హర్యానా రాష్ట్రాల్లో ఆదివారం సాయంత్రం అనేక చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసినట్లు భారత వాతవరణశాఖ పేర్కొంది.

## హిండెన్‌బర్గ్‌కు సెబీ ఛైర్‌పర్సన్ షోకాజు నోటీసులు

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (నిఘా న్యూస్): అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువలు కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో మాధబి పురికి, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్‌పై అమెరికా షార్ట్‌సెల్లర్ సంస్థ హిండెన్ బర్గ్ రీసెర్చ్ సంచలన ఆరోపణలు చేసింది. ఆ ఆరోపణలపై మాధబి పురి బచ్, ఆమె భర్త ధవల్ బచ్‌లు సంయుక్తంగా హిండెన్ బర్గ్‌కు నోటీసులు జారీ చేశారు. భారత్ చట్టాల్ని ఉల్లంఘించి హిండెన్ బర్గ్ ఆరోపణలు చేసిందని, అందుకే ఈ షోకాజు నోటీసులు జారీచేసినట్లు ధవల్ బచ్ దంపతులు తెలిపారు. హిండెన్ బర్గ్ ఆగస్ట్ 10న సంథింగ్ బిగ్ సూన్ ఇండియా అంటూ ట్వీట్ చేసింది. ఆ మరుసటి రోజే అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువలు కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన ఆఫ్‌షోర్ సంస్థల్లో మాధబి పురికి, ఆమె భర్త ధవల్ బచ్ దంపతులకు వాటాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ ఆరోపిస్తూ ట్వీట్ చేసింది. ఆ ట్వీట్‌కు మాధబి పురి స్పందించారు. హిండెన్ బర్గ్ తమ వ్యక్తిగత పరువుకు భంగం కలిగేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హిండెన్ బర్గ్ రిపోర్ట్‌లో పేర్కొన్న ఫండ్‌లో పెట్టుబడి పెట్టడం సెబీలో చేరడానికి రెండేళ్ల ముందు అంటే 2015లో జరిగిందని గుర్తు చేశారు. ఆ ఫండ్స్‌లో తాము పెట్టుబడులు పెట్టడానికి కారణం..ఆ ఫండ్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్(సీఐఓ) అనిల్ అహుజా తన స్నేహితుడని ధవల్ బచ్ తెలిపారు. అనిల్ అహుజా నా చిన్న నాటి స్నేహితుడు. పైగా ఇన్వెస్ట్‌మెంట్ రంగంలో అపారమైన అనుభవం ఉంది. సిటీ బ్యాంక్, జేపీ మోర్గాన్, 3ఐ గ్రూప్ పీఎల్‌సీ వంటి సంస్థల్లో పనిచేశారు' అని చెప్పారు.

## అనుకున్న సమయం కంటే ముందుగానే భోగాపురం ఎయిర్ పోర్టు

విజయనగరం, ఆగస్టు 11 (నిఘా న్యూస్): ఆగష్టు జిల్లాలోని భోగాపురం వద్ద నిర్మాణం జరుగుతున్న అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం పనులు జరుగుతున్న తీరును బట్టి అనుకున్న సమయం కంటే ముందుగానే పూర్తిచేయగలమనే నమ్మకం తమకుందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెప్పారు. వాస్తవానికి డిశంబరు 2026 నాటికి యీ ఎయిర్ పోర్టు నిర్మాణం పూర్తికావలసి వున్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల భోగాపురం ఎయిర్ పోర్టు పర్యటనకు వచ్చినపుడు నిర్ణీత గడువుకంటే ఆరు నెలలు ముందుగా జూన్ 2026 నాటికి పూర్తిచేయాలని గడువు విధించారని ఆ సమయానికే పూర్తిచేసే దిశగా వేగవంతంగా పనులు జరుగుతున్నా యని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవితో కలిసి ఆదివారం భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. జి.ఎం.ఆర్. గ్రూపు డిప్యూటీ మేనేజింగ్ డైరక్టర్ ఐ.ప్రభాకరరావు వారికి పనుల పురోగతిని వివరించారు. కేంద్ర రాష్ట్ర మంత్రులు ముందుగా ఎయిర్ పోర్టు టెర్మినల్ భవనం వద్దకు చేరుకొని పనులను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ముచ్చటించారు. అనంతరం టెర్మినల్ భవనం మొదటి అంతస్థుపైకి వెళ్లి అక్కడ జరుగుతున్న పనులను తెలుసుకున్నారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటిసి) టవర్ నిర్మాణం పనులను కూడా మంత్రులు పరిశీలించారు. అనంతరం రన్ వే నిర్మాణాన్ని పరిశీలిస్తూ ఎల్ అండ్ టి సంస్థ ప్రాజెక్టు స్థలానికి చేరకున్నారు. అక్కడ నిర్మాణం పనులపై జి.ఎం.ఆర్. సంస్థ ప్రతినిధులు ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం మంత్రి రామ్మోహన్ నాయుడు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ నిర్మాణం పనుల పురోగతిని వివరించారు. ప్రతి నెలా పనుల ప్రగతిని సమీక్షించి ప్రజలకు వివరిస్తామని స్పష్టంచేశారు. ఎయిర్ పోర్టు పనులు ఆగష్టు 11నాటికి 36.6 శాతం పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. గత నెల జూలై 11కి 31.8 శాతం పనులు పూర్తికాగా గత నెల రోజుల్లో అదనంగా 4.8 శాతం పనులు జరిగాయని చెప్పారు. భారీవర్షాలు నిరంతరాయంగా కురుస్తున్న సమయంలోనూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనులు నిరాటంకంగా జరపడం వల్ల పనుల్లో యీ ప్రగతి సాధ్యమైందని పేర్కొంటూ జి.ఎం.ఆర్.సంస్థ ప్రతినిధులను, ఎల్ అండ్ టి ప్రతినిధులను మంత్రి అభినందించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఎయిర్‌పోర్టు పనులు అనుకున్న సమయానికంటే ముందుగా పూర్తిచేసేందుకు ప్రత్యేక దృష్టి సారించి కృషిచేస్తున్నాయని చెప్పారు.

## కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం

### ముధోల్ మాజీ శాసనసభ్యులు జి.విఠల్ రెడ్డి



**కుబీర్, ఆగష్టు 11 (నిఘా న్యూస్):** మండలంలోని సౌంఢ్లి అనుబంధ గ్రామం లింగి గ్రామంలో నీటి ఏద్దడి బాగా ఉంది ఎన్ని బోర్లు వేయించి నప్పటికీ సుమారు 500 ఫీట్ల వరకు బోర్లు వేయించినప్పటికీ నీళ్ళు పడక పోవడంతో దానికి శాశ్వత పరిష్కారం దిశగా గ్రామ మాజీ సర్పంచ్ లాయవర్ సాయినాథ్, గ్రామస్థుల తో కలిసి ఈ విషయాన్నీ మాజీ శాసనసభ్యులు జి.విఠల్ రెడ్డి విన్నవించటం జరిగింది. అయన గ్రామస్థుల తో చర్చించి శాశ్వత పరిష్కారం దిశగ నిర్మల్ జిల్లా ఇంచార్జి సీతక్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా సుమారు 10 లక్షల రూపాయల ఎస్ డిఎఫ్, నిధులతో పైప్ లైన్, బోర్స్ మరియు బోరుబావి కోసం ప్రొసిడింగ్ కాపీలను ఆదివారం గ్రామస్తులకు అందజేయడం జరిగింది. సంబంధిత అధికారులులకు ఫోన్ చేసి వెంటనే పనులు ప్రారంభించాలని చెప్పటం జరిగింది.

## డెంగ్యూపై అవగాహన కల్పించిన డప్పు కళాకారులు



**లోకేశ్వరం, ఆగష్టు 11 (నిఘా న్యూస్):** మండల కేంద్రంలో బస్టాండు లో ఆదివారం డప్పు కళాకారులు, వైద్య సిబ్బంది డెంగ్యూ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలం దృష్ట్యా డెంగ్యూతో పాటు సీజనల్ వ్యాధులపై అప్రమత్తతో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వలేకుండా ఉంచడం వల్ల దోమలు వ్యాప్తిని నివారించవచ్చని సూచించారు. డెంగ్యూ అని అనుమానం వస్తే వెంటనే దగ్గర్లోని ప్రభుత్వాసుపత్రి వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వైద్య సిబ్బంది గ్రామస్తులు తదితరులు ఉన్నారు.–

## సీనియర్ జర్నలిస్ట్ కామేశ్వర్ మృతి



**చంద్రగిరి, ఆగస్ట్ 11 (నిఘా న్యూస్):** పాకాల మండలం పాకాల పంచాయతీ రామకృష్ణ మందిరం వీధికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఇ.కామేశ్వర్ గుండెపోటుతో అకాల మరణం చెందారు. ఆదివారం పాకాల మీడియా మిత్రులు, సిపిఎం, కెవిపిఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మధుసూదన్ రావు మాట్లాడుతూ ఆయన సిపిఎం పార్టీలో కొనసాగుతూ విలేకరిగా పనిచేస్తూ సమాజానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్ రెడ్డి, పద్మభూషణ నాయుడు, మురళి, నారాయణ మధు, సుబ్రహ్మణ్యం తిరుమల, ద్వారక మీడియా మిత్రులు, సిపిఎం, కెవిపిఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మొబ్బినాయన పల్లెలో మహా భారతం



**చంద్రగిరి, ఆగస్ట్ 11 (నిఘా న్యూస్):** పాకాల మండలం దామలచెరువు పంచాయతీ మొబ్బినాయనపల్లెలో మొబ్బినేని చైతన్యకుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 14వ వార్షికోత్సవ మహాభాతం12 రోజులపాటు నిర్వహించామని ట్రస్ట్ చైర్మన్ మబ్బునేని రఘుపతి, ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం నాలుగు గంటలకు దుర్యోధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం బూసిపల్లి చంగల్ రెడ్డి జ్ఞాపకార్థంగా కుమారుడు బి.గోవర్ధన్ రెడ్డి వితరణ చేయడం జరుగుతుందని తెలిపారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశం,ధర్మరాజుల పట్టాభిషేకం నిర్వహించామని పేర్కొన్నారు.

## కిండిల్ క్లౌడ్స్ ప్లే స్కూల్ ప్రారంభం



**కాప్రా, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** కాప్రా వంపుగూడ రాజీవ్ ఎంక్లేవ్ లో కిండిల్ క్లౌడ్స్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్ ను ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సయ్యద్ కరీముద్దీన్, ప్రిన్సిపాల్ షమీమ్ షేక్, బి ఆర్ ఎస్ నాయకులు బైరి నవీన్ గౌడ్, బి ఆర్ ఎస్ పార్టీ మైనారిటీ స్టేట్ లీడర్ బద్రుద్దీన్, బిఆర్ఎస్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# గెట్ టు గెదర్ విత్ కార్పొరేటర్

### వినతులు స్వీకరించిన బన్నాల ప్రవీణ్



**చిలుకానగర్, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** చిల్కానగర్ డివిజన్ లోని రాఘవేంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కౌశిక్ సోమేశ్ లు ఏర్పాటు చేసిన గెట్ టు గెదర్ విత్ కార్పొరేటర్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసి కాలనీ లోని పలు సమస్యలు బన్నాల ప్రవీణ్ ద్వారా కార్పొరేటర్ చే పనులు పూర్తి చేయాలని విన్నవించారు. కాలనీలో కార్పొరేటర్ ద్వారా ప్రభుత్వం నుంచి కమ్యూనిటీ హాల్ కొరకు 243 గజాల స్థలం కేటాయించినందుకు ప్రతి ఒక్క కాలనీ సభ్యుడు ఆనందంగా ఉన్నారని కార్పొరేటర్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ దానికి ప్రహరీ ఏర్పాటు చేసినందుకు కార్పొరేటర్ ని ప్రత్యేకంగా సత్కరించుకోవాలని అందులో వెంటనే కమ్యూనిటీ హాల్ కొరకు నిధులు కేటాయించాలని రోడ్ నెంబర్ 3,5 అండ్ 9 లో కొత్త రోడ్లు వేయాలని చౌరస్తాలో మిని హైమాస్క్ లైట్స్ ఏర్పాటు చేయాలని, కొన్ని వీధుల్లో కొత్త వాటర్ పైప్ లైన్లు వేయాలని ముఖ్యంగా అమ్మవారి ఆలయం ముందు సీవరేజ్ లైన్ తరచుగా పొంగుతుందని కొత్త పైప్ లైన్ ఏర్పాటు చేయాలని, నూతన ఎలక్ట్రికల్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సమావేశంలో వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందిస్తూ బన్నాల ప్రవీణ్ కార్పొరేటర్, ఎమ్మెల్యే చొరవతో కాలనీలోని అన్ని సమస్యలను దశల వారీగా పూర్తి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

## ఆత్మహత్యకు పాల్పడ్డ.. జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకోవాలి

### టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పుప్పాల దేవిదాస్



**భైంసా, ఆగష్టు 11 (నిఘా న్యూస్):** వరంగల్ లో ఆత్మహత్యకు పాల్పడ్డ యోగిరెడ్డి అనే జర్నలిస్టు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పుప్పాల దేవిదాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ జావిద్ డిమాండ్ చేశారు. ఆదివారం బైంసాలో వారు మీడియాతో మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు. యజమాన్యాలు తక్కువ వేతనాలు ఇవ్వడం తో జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. నిరంతరం ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే పాత్రికేయులు కష్టాల్లో ఉన్నారని జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాల్సిందిగా కోరారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలపాటు జర్నలిస్టులను పట్టించుకోలేదని, ఇకనైనా కాంగ్రెస్ సర్కార్ యోగి రెడ్డి కుటుంబానికి 50 లక్షలు రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జర్నలిస్టులు బషీర్,విలాస్ మురళి హన్మాండ్లు,సత్యనారాయణ, భాస్కర్ తదితరులున్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలను... ముందు తరాలకు అందించాలి



### పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ దామోదర్ గుప్తా

**హైదరాబాద్, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆనాటి స్వాతంత్ర్య పోరాటం, సంస్కృతి, సంప్రదాయాలు ముందు తరాలకు అందించడంతో పాటు తెలియజేయడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదరుప్తా అన్నారు. ఈ మేరకు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు లయన్ లలితరావు ఆధ్వర్యంలో సాయంత్రం చిన్నారి, యువ గాయనీగాయ కులు, నృత్య కళాకారులు తెలుగు హిందీ భాషల్లో వీనుల విందుగా ఆలపించిన దేశభక్తి ఆధ్యాత్మిక గీతాలు, నృత్య ప్రదర్శనలతో భారతదేశ ఔన్నత్యాన్ని, చరిత్ర, కళలు, పండుగల గొప్పదనాన్ని చాటుతూ జయహో భారత్ అంటూ మార్మోగి పోయింది. కుల, మత ప్రాంతీయ భాషలకు అతీతంగా పలువురు ప్రముఖ గురువుల శిష్యులు 300 మందికి పైగా నృత్య కళాకారులు, గాయకుల దేశ భక్తిగీతాలు ఆహుతులైన ప్రేక్షకులను, దేశభ క్తులను చైతన్య పరచడమే కాకుండా ఉర్రూతలూగించాయి. విశిష్ట అతిథులుగా దైవజ్ఞశర్మ, గీతాసాంగ్, తుమ్మలపల్లి రామసత్య నారాయణ, చకిలం స్వప్న తదితరులు పాల్గొని జయహో భారత్ లో పాల్గొన్న గురువులను ఘనంగా సన్మానించి వారి శిష్యులకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు.

## ఆశా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి





**రాజోలి, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** రాజోలి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పచ్చర్ల గ్రామంలో పనిచేస్తున్న ఆశా కార్యకర్త మహబూబి (58) కుటుంబంను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐ ఎన్ టి యు సి) జోగులాంబ గద్వాల జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాష్ అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన హుటాహుటిన పచ్చర్ల కు చేరుకుని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె మృతి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తగా ఆమె గత 20 ఏళ్ళుగా గ్రామంలో పనిచేస్తు ప్రజల మన్ననలు పొందిందని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించారు. ఆమే అకాల మరణం చెందడం దురదృష్టకరం అని చెప్పారు, ఆమె కు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు అని చెప్పారు.ఆమె కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని యూనియన్ జిల్లా నేత జయప్రకాష్ కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు, జిల్లా యూనియన్ నాయకులు రంజిత్ కుమార్, సుజాత, ఎం ఎల్ హెచ్ పి వేంకటేశ్వరి, ఏ ఎన్ ఎం లు ఆశా కార్యకర్తలు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## సాహిత్యరత్న అన్న భావు సాటే జయంతి వేడుకలు



**తానూర్, ఆగష్టు 11 (నిఘా న్యూస్):** మండలం లోని ఉమ్రి (కే)గ్రామంలో 104వ జయంతి వేడుకల్లో, అన్న భావు సాటే క్రాంతి సేన ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షులు ఉత్తం భలే రావు ముఖ్య అతిథిగా పాల్గొని అన్నాభావు సాటే విగ్రహానికి పూజ చేసి జెండాను ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సాగర్ బాయ్ రాజన్న మాట్లాడుతూ అన్న భావు సాటే బాటలో ప్రతి ఒక్క రు నడవాలి వారు రచించిన కదంబరీలు ,రచనలు, గ్రంథాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలి. అందరికీ 104వ జయంతి శుభాకాంక్షలు ఉత్తం భలే రావు మాట్లాడుతూ అన్న భావు సాటేకి భారతరత్న అవార్డు ఇవ్వాలని కోరడం జరిగింది. మంద కృష్ణ మాదిగ 30 సంవత్సరాల పోరాటం ఫలించింది. ఏ బి సి డి వర్గీ కరణ కు మద్దతు తెలిపినందుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ మంద కృష్ణ మాదిగ తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్ర పాటలకు పాలాభి షేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సాగర్, బాయ్ ఎంపీపీ చంద్రకాంత్, యాదవ్ సొసైటీ డైరక్టర్ గోవింద్ రావు పటేల్, ఎల్వీ మాజీ సర్పంచ్ కను గంటి పోత రెడ్డి, అన్న భావు సాటే క్రాంతి సేన ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షులు ఉత్తం భలే రావు,ఉపాధ్యక్షులు చంద్ర బాన్,గణపతి ఉపాధ్యాయులు గోరేకర్ శంకర్ రైటెడ్ ఆర్మి అమృత్ లైన్ మేయిన్ పుడ్లిక్ ,రిటైడ్ ఏ ఆర్ ఎస్సై చిలింకర్ గంగాధర్ సినిమా డైరెక్టర్ కొత్తూరు శంకర్, అష్ట పోషెట్టీ సింగర్ లాలు గైక్వాడ్ ఝరి బి, కత్తి లక్ష్మణ్ ఏల్వి గంగాధర్, సురేఖ బాయ,ధుర్పత్ బాయి బాలాజీ, దత్తు,ఉమ్రి కే గ్రామ పంచాయతీ పెద్దలు మహిళలు లక్ష్మన్, శ్రవణ్, సాయినాథ్ శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

## ఎల్వత్ గ్రామంలో బైక్ పై ఎమ్మెల్యే పర్యటన



**భైంసా, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** ఎల్వత్ గ్రామంలో ఎమ్మెల్యే పర్యటన బైక్ పై తిరుగుతూ రోడ్ల పరిశీలన పలు సమస్యలను విన్నవించిన గ్రామస్తులు నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని ఎల్వత్ గ్రామంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆదివారం పర్యటించారు. గ్రామంలో బుల్లెట్ పై తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తులతో కలిసి రోడ్లను పరిశీలించారు. ఎల్వత్ నుండి కార్బల గ్రామం వెళ్లే రోడు వర్షాలకు దెబ్బతినడం ఆ వైపు రాక పోకలు నిలిచిపోయే ఆస్కారంఉంది. తక్షణమే మరమ్మత్తులు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. పంచకట్టుతో బుల్లెట్ పై తిరుగుతూ సమస్య లు తెలుసుకోవడం గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఇటీవల గ్రామంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు.ఆయన వెంట బిజెపి మండల నాయకులు శివాజి పటేల్, మాజీ సర్పంచ్, లు చక్రధర్ పటేల్,సిందే హన్మంత్,అశోక్, సురేష్ తదితరులు ఉన్నారు.

## గీతానగర్ పార్కులో డ్రాయింగ్ పోటీలు



**మల్కాజిగిరి, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** భారత స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా మల్కాజిగిరి సర్కిల్ గీతానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15 సంవత్సరాల లోపు విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఆదివారం పార్కులో నిర్వహించిన ఈ పోటీల కార్యక్రమంలో చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మాలోతు శంకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమ వెంకటేష్ అంబు, కృష్ణమూర్తి శ్రీనివాస్, వివేక్ రఘు, మురుగేషన్ కిరణ్ కుమార్ సతీష్, బాలకృష్ణ వీరు నిర్వాహకులుగా వ్యవహరించారు.

## 210వ వారం.. బాబాసాహేబ్ కు ఘన నివాళి



**ఉప్పల్, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** ఉప్పల్ జైభీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతి వారం ప్రపంచ మేధావికి మణిహారం కార్యక్రమంలో భాగంగా 210వ ఆదివారం ఉప్పల్లోని నాలెడ్జి పార్క్ లో గల బోధిసత్వ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహంనకు చిల్కనగర్ కు చెందిన బాలు ముఖ్య అతిథిగా హాజరై జ్ఞాన పూల మాల వేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్ర బాలరాజు, కోశాధికారి రాపోలు రవి, ఉపాధ్యక్షులు ఏసూరి బాల పోచయ్య, నాగోల్ రమేష్, సాయిప్రసాద్, రామంతపూర్ వెంకటేష్, బొప్పెనా శ్రీదర్, లాలపేట్ వెంకటేష్, సలహాదారు జోన్నపల్లీ క్రాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

## మెనూ భోజనం అందించాలి



**చోడవరం, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** చోడవరం లోని అన్నవరం బీసీ గర్ల్స్ హాస్టల్ లో చాలా దయనీయమైన పరిస్థితిలు నెలకొన్నాయని ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని వాష్ రూ మ్స్, వాటర్ ట్యాంక్, డ్రైనేజీ, గార్డెన్ ను విద్యార్థుల చేత క్లీన్ చేస్తున్నారని తెలిపారు. వంట విధుల నుంచి పార్వతిని తొలగించాలని సరైన భోజనం అందించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వరలక్ష్మి డిమాండ్ చేశారు.



మల్కాజిగిరి నియోజక వర్గం పరిధిలోని యాప్రాల్ కట్ట మైసమ్మ బోనాల పండుగ వేడుకల లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి స్వాగతం పలికారు.

*–మల్కాజిగిరి, ఆగస్టు 11 (నిఘా న్యూస్):*

# మధురా నగర్ లో జన ఔషధీ కేంద్రం

### ప్రారంభించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల

**మల్కాజిగిరి, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** భారతీయ జనతా పార్టీ నాయకులు గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో నియోజక వర్గం వ్యాపితంగా ప్రధానమంత్రి జన ఔషధీ కేంద్రాలను నడుపుతున్నారు. అందులో బాగంగా మరో కేంద్రాన్ని నేరేడ్ మెట్ డివిజన్ మధుర నగర్, సైనిక్ విహార్ కాలనీలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 12,400 పైగా కేంద్రాలు ఉన్నాయని ఈ కేంద్రాలలో దాదాపు 50 నుండి 90 శాతం మార్కెట్ ధరలు కన్నా నాణ్యత కలిగిన మందులు ,బ్రాండెడ్ తో సమానమైన క్వాలిటీ కలిగి అన్ని పరీక్షలు జరిగిన తర్వాత ఈ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా మందులు సరఫరా చేయబడుతున్నాయి అని అన్నారు. భారతదేశంలో ప్రతి మనిషి డబ్బు లేక ఆరోగ్యం క్షీణించి ప్రాణాలు కోల్పోకూడదని ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోది ప్రవేశపెట్టిన అనేక పథకాలలో ఒక బ్రహ్మాండమైన పథకం పీఎం భారతీయ జన ఔషధి పథకం. ఈ పథకం బీద బడుగు బలహీన వర్గాల వారికి ఒక బ్రహ్మాండమైన వరం లాంటిది. ఈ కేంద్రాలలో బీపీ షుగర్ క్యాన్సర్ లివర్ ఇతర అనేక రకాలైన జబ్బులకు మార్కెట్ ధరల కన్నా దాదాపు 50 నుండి 90 శాతం తక్కువ ధరలకే మందులు అందిస్తున్నరని



పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ తెలియజేశారు. జన ఔషధీ కేంద్రాలలో అవసరమైన మందులు కొనుక్కొని డబ్బులు ఆదా చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో జన ఔషధీ కేంద్రాలను నడువుతున్న నిర్వాహకులను అభినందించారు. రమణారెడ్డి మాట్లాడుతూ తన 27వ జన ఔషధీ కేంద్రం మధుర నగర్ కాలనీలో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ప్రజలకు మరింత సేవ చేయాలని తపన ఉందని మంచి హృదయంతో పని చేస్తున్నానని చెప్పారు. మహిళలు వాడుకునే సానిటరీ పాడ్స్ ఒక్క రూపాయికి ఒకటి అందుబాటులో పీఎం జన్ ఔషధి కేంద్రాలలో ఉన్నాయని ప్రతి మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని



ఆరోగ్యంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచంద్ర రావు, మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ , వినాయక నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, మాజీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు గీత మూర్తి, నేరేడ్మెట్ డివిజన్ అధ్యక్షులు సత్యనారాయణ బాబు, వినాయక నగర్ డివిజన్ బిజెపి ప్రెసిడెంట్ ఓం ప్రకాష్, సైనిక్ విహార్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. అనంతరం మహిళలకు కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, గీత మూర్తి జన ఔషధీ కేంద్రాల నిర్వహకులు గోపు లక్ష్మీ శానిటరీ ఫ్యాట్స్ పంపిణీ చేశారు.

## నాచారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**నాచారం, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** నాచారం డివిజన్ భవాని నగర్ లో 10 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించే క సిమెంట్ రోడ్డు, వి ఎస్ టి కాలనీలో 10 లక్షల రూపాయలతో కొత్త సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సమరయోధుల విగ్రహాలను శుభ్రం చేసిన నేతలు



**నల్లకుంట, ఆగస్ట్ 11 (నిఘా న్యూస్):** ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నల్లకుంట డివిజన్ లో బిజెపి నాయకులు స్వతంత్ర సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్ రావు, నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ వై.అమృత లు ముఖ్య అతిథులుగా పాల్గొని డివిజన్ లోని సత్య నగర్ అంబేద్కర్ విగ్రహం, న్యూ నల్లకుంట లోని గాంధీ విగ్రహాన్ని కార్యకర్తలతో కలిసి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ కేబీ నర్సింగరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసులను సన్మానించిన బోరంపేట



**ఉప్పల్, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** ఉప్పల్ లో నిర్వహించిన బోనాల దిగ్విజయంగా పూర్తి కావడానికి సహకరించి, పూర్తి సహాయ సహకారాలు అందించిన ఉప్పల్ పోలీసు అధికారులను బిజెపి నాయకులు బోరంపేట మురళీకృష్ణ ముదిరాజ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఉప్పల్ లో బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరగడానికి ఉప్పల్ పోలీసుల కృషి ప్రశంసనీయమని కొనియాడారు. ఉప్పల్ సీఐ ఎన్.ఎలక్షన్ రెడ్డి, అడ్మిన్ ఎస్ఐ కోటేశ్వరరావు, ఎస్సైలు చిరంజీవి, మాధవ రెడ్డి లను ఘనంగా సత్కరించి బోరంపేట మురళీకృష్ణ అభినందనలు తెలియజేశారు.

## అలరించిన భరత నాట్య ప్రదర్శనలు



**ఉప్పల్, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీ వారి పాదాలు భరత నాట్యం డాన్స్ అకాడమీ గురువులు రమాదేవి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలో భాగంగా పుష్పాంజలి, గణేశా ప్పరత్నం, గజవదాన, కృష్ణం కలయసఖి, జతిస్వరం, కావడి చిందు, అన్నమాచార్య కీర్తనలు, కంజదళాయతాక్షి స్తోత్రం, ఆనంద నర్తన గణపతిమ్, నటేశ కౌతం, సుబ్రమణ్య కౌతం, తిల్లాన అంశాలను కళాకారులూ స్వాతిక, వైష్ణవి, కార్తీక, నిత్యశ్రీ, శరణ్య, కావ్య శ్రీ, మహేశ్వరి, భార్గవి, కీర్తన, గుంజన్, సంకీర్తన, మంజుల, జ్యోస్నా మొదలైన కళాకారులూ ప్రదర్శించి మెప్పించారు.

## నేటికీ నెరవేరని అంబేద్కర్ ఆశయాలు




**నారాయణపేట, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా మక్తల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సిపిఐ పార్టీ శాఖా సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి దేశంలోని పేదలు బడుగు బలహీన వర్గాలు, ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ ఆదివాసీలకు అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ఫలాలు నేటికీ సమగ్రంగా అమలు జరగడం లేదని, ఫలితంగా రాజ్యాంగ ఫలాలకు దూరమవుతున్న స్థితి ఉన్నదని, కనుక ప్రభుత్వమే రాజ్యాంగం పట్ల ప్రజలకు చైతన్యం కలిగించే కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బాబాసాహెబ్ భీమ్రావు రాంజీ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ప్రతులను అధికారికంగా 22 భాషల్లో ముద్రించి దేశ వ్యాప్తంగా ఇంటింటికీ పంపిణీ చేయాలని కొండన్న డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్, నాయకులు వెంకటేష్, శ్రామిక మహిళా యూనియన్ నాయకులు నారాయణమ్మ, సరోజమ్మ నర్సమ్మ దేవమ్మ, లక్ష్మణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వంద శాతం విద్యార్థుల ఉత్తీర్ణతకు కృషి

### కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం.డి.షరీఫ్



**తాండూరు, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** ఈ విద్యా సంవత్సరం పదో తరగతి వార్షిక పరీక్షలలో తమ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తో పాటు, కాంప్లెక్స్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే దిశగా విద్యార్థులకు విద్యా బోధన అందించడం జరుగుతుందని బషీరాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం.డి షరీఫ్ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత జూన్, జూలై నెలలో ఎఫ్ ఏ వన్ విద్యా పద్ధతిలో విద్యార్థులకు బోధించిన పాఠ్యాంశాల ల నుండి ఎఫ్ ఏ వన్ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఎఫ్ ఏ వన్ పరీక్షలలో మంచి ఉత్తీర్ణత శాతం ఫలితాలు వచ్చాయని వెల్లడించారు. అదేవిధంగా ఆగస్టు నెలలో నిర్దేశించిన పాఠ్యాంశాలు బోధించడం జరుగుతుందన్నారు. నేషనల్ అచీవ్మెంట్ సర్వే మెథడ్ పద్ధతిన విద్యను బోధించడం జరుగుతుందని తెలిపారు. తన కాంప్లెక్స్ పరిధిలో 3 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని అదేవిధంగా 12 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు తన కాంప్లెక్స్ పరిధిలోకి వస్తాయని వెల్లడించారు. ప్రాథమిక పాఠశాలలను పర్యటించి విద్యార్థులకు అందుతున్న విద్యా బోధనను పరిశీలించడం జరుగుతుందన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, వార్షిక పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణకు కృషి చేస్తున్నామని వివరించారు.

# టైక్వాండో సౌత్ జోన్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్




### విజేతలకు డాక్టర్ గోపి నాయుడు బహుమతుల ప్రధానం

**తిరుపతి, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** టైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలు టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ మాస్టర్ డాక్టర్ గోపి నాయుడు ఆధ్వర్యంలో సౌత్ జోన్ పోటీలు తిరుపతిలోని రామ తులసి కళ్యాణ మండపంలో నిర్వహించారు.ఈ పోటీలలో తిరుపతి చిన్నారులు తమ ప్రతిభతో గోల్డ్ పథకాలను సాధించారు. తిరుపతిలో జరిగిన టెక్వాండే పోటీలు జిల్లా అధ్యక్షులు డాక్టర్ గోపి నాయుడు ఆధ్వర్యంలో గెలుపొందిన వారికి మెడల్స్ సర్టిఫికెట్లను అందజేశారు. టైక్వాండో అధ్యక్షులు డాక్టర్ గోపి నాయుడు ఆధ్వర్యంలో 170 మంది మదనపల్లి చిత్తూరు,తిరుపతి,జిల్లాలు నుంచి వచ్చిన టెక్వాండో లో శిక్షణ పొందన విద్యార్థులకు జరిగిన పోటీల్లో గెలుపొందిన వారికి మెడల్స్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎ,చంద్ర శేఖరన్,టైక్వాండో సెక్రటరీ విజయ్ కుమార్ ,గురువులు శ్రీను, యుగంధర్, దాము అనిల్ కుమార్ రాహుల్, వినయ్, జానకిరామన్ లీలామన్స,ఆర్ టి తదితరులు అధ్యాపకులచే నిర్వహించి రాష్ట్ర స్థాయిలో టైక్వాన్ డో పోటీలలో పాల్గొనేందుకు వారిలో 34 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారికి మెడల్స్ సర్టిఫికెట్లను అందజేశారు.

# మా ఇండ్లలోకి పాములు వస్తున్నాయి

- అభివృద్ధికి నోచుకోని డబుల్ బెడ్రూమ్ ఇల్లు
- ఇళ్ల చుట్టూ పిచ్చి మొక్కలు ముళ్ళ పొదలు
- ఇళ్ల మధ్యలో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ కానరాని సిసి రోడ్లు



**సిద్దిపేట, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రెండవ వార్డు నర్సాపూర్ గుండ్లచెరువు కేసీఆర్ నగర్ కాలనీలో నాణ్యత లేని అండర్ ప్రాస్ డ్రైనేజి పైపులైన్ నుండి మురుగు నీరు ప్రవహించడంతో ఇక్కడ సమస్యలు తిష్టవేసినాయి, అధికారులు తమ సిబ్బందితో నెలలో రెండుమూడు సార్లు పర్యవేక్షించి చర్యలు చేపట్టిన ఫలితం లేక పోతుంది. ఇక్కడ కాలనీ ఏర్పడి సుమారు ఆరేండ్ల పైబడి కావస్తున్న, పూర్తిస్థాయిలో సిసి రోడ్ల నిర్మాణం కాంట్రక్టర్ చేపట్టలేదు. అంతేకాకుండా నాణ్యతలేని డ్రైనేజ్ పైపులైన్ నిర్మాణాల వల్ల వీధులవెంట మురుగు నీరు ఎప్పుడు ప్రవహిస్తూనే ఉంటుంది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక చిన్నపాటి వర్షం కురిస్తేనైతే మురుగు నీటితో వర్షపు నీరుకు పోటీపడి వీధులను ముంచేస్తుంది. కాలనీలో మొత్తం 202 బ్లాక్ ల్లో సుమారు రెండు వేల పైబడి కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అధిక సమస్యంతా ప్రధానంగా ఇక్కడే ఉంది. 197,198,196, 23, 24, 25, బ్లాక్ ల వద్ద. ఈబ్లాక్ లు కరీంనగర్ రోడ్డు ప్రధాన రహదారికి దగ్గరలో ఉంటాయి. ఇక్కడ నివాసం ఉంటున్న ప్రజలు ఈ మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడద అధికమై, వస్తున్న దుర్వాసన వల్ల ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో రోగాలబారిన పడుతే, మరికొందరు దోమ కాటుతో విష జ్వరాల బారిన పడుతున్నారు. ఈ బ్లాకుల వద్ద సిసి రోడ్ నిర్మాణాలు చేపట్టక పోవడంతో పిచ్చి మొక్కలు, ముళ్ళ పొదలు పెరగడంతో విష సర్పాలు, తేళ్లు, జెర్రిలు ఇళ్లల్లోకి వస్తున్నాయాని కాలనీవాసులు వాపోతున్నారు. నాటి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో సిసి రోడ్ పనులు చేపట్టక పోవడంతో ఇక్కడ పిచ్చి మొక్కల పొదలు అధికంగా పెరిగి విష సర్పాలకు, తేళ్లకు, ఆవాసాలుగా మారాయి. వారంలో రెండుమూడు సార్లు కాలనీ వాసులు పాములను, తేళ్లను, జెర్రిలను చంపేస్తుంటారు. పాముల, తేళ్ల బెడదతో ఇక్కడి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు, ఇక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ రోడ్డుకు సమీపంలో ఉన్న బ్లాక్ లలో ఎటు చూసినా అస్తవ్యస్తమైన డ్రైనేజ్ వ్యవస్థ, మట్టి రోడ్లు విపరీతమైన గడ్డితో స్వాగతం పలుకుతున్నాయి. 24వ బ్లాక్ వద్ద మురికి కాలువలు సరిగా లేక పోవడంతో మురుగు నీరంతా మినార్ చుట్టూ స్తంభించి దుర్వాసన వెదజల్లుతుంది. మరోవైపు రోడ్లపై పారుతున్న మురుగు నీరుతో దోమలు ఈగల వల్ల రోగాల బారిన పడవలసి దుస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిసి రోడ్లు లేక పోవడంతో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయని వాపోతున్నారు. వృద్ధులు చిన్నపిల్లలు బురద రోడ్లపై నడవలేని పరిస్థితులు నెలకొన్నాయని, ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు స్పందించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

## నూతన జంటను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**పెబ్బేరు, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో పలు వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదివారం పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట స్థానిక నాయకులు జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి.రాంచంద్రారెడ్డి, భరత్ కుమార్ రెడ్డి,వెంకట రమణ, సింగిల్ విండో డైరెక్టర్ పెద్దింటి చంద్రయ్య, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్,యుగంధర్ రెడ్డి,సాయిరెడ్డి,శంకర్ రెడ్డి ఉన్నారు.




**చనిపోయిన తమ కుమారుడు దివంగత సంగిశెట్టి సుమిత్ కుమార్ 23 వ పుట్టినరోజు సందర్భంగా అతని తల్లిదండ్రులు ఉమాదేవి, కిషోర్ కుమార్ లు పేద విద్యార్థులకు అన్నదానం చేశారు. సికింద్రాబాద్ రాణిగంజ్ బైబిల్ హౌస్ సమీపంలోని ఆశ్రిత రెసిడెన్షియల్ హోమ్ ఫర్ బాయ్స్ ఆశ్రమంలో పేద విద్యార్థులకు అన్నదానం చేశారు. అంతకుముందు సుమిత్ కుమార్ తల్లిదండ్రులు తమ కుమారుడి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి అతని జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు.**

*-సికింద్రాబాద్, ఆగస్ట్ 11 (నిఘా న్యూస్):*



**బాగ్ అంబర్ పేట్ డివిజన్లోని వాంబే కాలనీలో నూతనంగా నిర్మించిన గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్ ను అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు రామస్వామి, కార్యదర్శి సుధాకర్, సభ్యులు కుమార్, చందు తదితరులు పాల్గొన్నారు.**

*-బాగ్ అంబర్ పేట్ ఆగస్ట్ 11(నిఘా న్యూస్):*

## అంబేద్కర్ స్మృతి వనం వద్ద..

### జగన్ పేరును తొలగించడం దారుణం



**పామర్రు, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బిఆర్ అంబేద్కర్ స్మృతి వనం వద్ద జరిగిన దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం, విగ్రహం వద్ద తొలగించింది మాజీ ముఖ్యమంత్రి పేరు అయినప్పటికీ అది భారత రాజ్యాంగ నిర్మాత విగ్రహంపై చేసిన దాడిగా ప్రభుత్వం పరిగణించాలని కోరారు. నగర నడిబొడ్డులో కోట్లాదిమంది ఆరాధ్యుడు భారతదేశానికి అత్యున్నత రాజ్యాంగం అందించిన మహనీయుడి విగ్రహం వద్ద లోపించిన భద్రత వైఫల్యాన్ని చక్కదిద్దాలి. ఇలాంటి ఘటన రాష్ట్ర ప్రభుత్వానికి తలవంపులు తెచ్చే విధంగా ఉందని దోషులెవరో గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని కాకి రాజశేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**పెబ్బేరు, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** పెబ్బేరు నుంచి వనపర్తి వెళ్ళే రోడ్డు నిర్మాణం, పనులను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పెబ్బేరు పర్యటనలో భాగంగా,పనులను పరిలించారు.అనంతరం ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ... త్వరలో పెబ్బేరు పట్టణంలో కుడా రోడ్డు పనులను పూర్తి చేసి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఎమ్మెల్యే వెంట వనపర్తి బ్లాక్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,జిల్లా యువజన నాయకులు గంధం రంజిత్ కుమార్, మాజీ సర్పంచ్ లు వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, మాజీ డైరెక్టర్ రాములు, టౌన్ ఉపధ్యక్షులు రజక నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ బిఆర్ఎస్ అధ్యక్షునిగా భాస్కర్ యాదవ్



**మేడ్చల్, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** మేడ్చల్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షునిగా భాస్కర్ యాదవ్ నియమితు లయ్యారు. ఆదివారం మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. భాస్కర్ యాదవ్ బిఆర్ఎస్ పార్టీ కి అభివృద్ధికి ఎంత కృషి చేశారని, బిఆర్ఎస్ పార్టీ కి ఆయన చేసిన సేవలను గుర్తించి అధిష్ఠానం భాస్కర్ యాదవ్ కి ఈ పదవి ఇవ్వడం జరిగిందని తెలిపారు. తనపై నమ్మకంతో మేడ్చల్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించినందుకు అధిష్టానానికి, మాజీ సిఎం కేసిఆర్ కి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. సహకరించిన మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నాపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టు కుంటానని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## సత్యా నగర్ కాలనీ అధ్యక్షుడిగా ఎస్.హరి




**మేడ్చల్, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** సత్యా నగర్ కాలనీ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో కాలనీ సభ్యులందరూ మూడవ సారి ఎన్నికల కోసం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా మూడవ సారి ఎస్.హరి ని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు హరి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మూడవ సారి అధ్యక్షుడిగా ఎన్నుకున్న కమిటీ సభ్యులకు కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలోని సమస్యల పరిష్కారానికి కాలనీ అభివృద్ధికి తాను చేసిన కృషి కారణంగానే మరల అధ్యక్షుడిగా ఎన్నుకోవడం ఆనందంగా ఉందని హరి తెలిపారు. అనంతరం ఉపాధ్యక్షుడు మోసే దయాన్, కార్యదర్శి కాజా రఫీ ఉద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న కలసికట్టుగా సభ్యులందరితో చర్చించి సమస్యల పరిష్కారానికి కాలనీ కృషి చేసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో లింగారెడ్డి, సురేష్ కుమార్, సునీల్, వెంకటేశ్వర్లు, సాయిరాం కుమార్, కిష్టయ్య, ప్రభాకర్, శీతల్ కుమార్, ఉమేష్, శ్రీనివాస్,విఠల్ రావు, కిష్టయ్య, ప్రదీప్, రాజారావు, శివ గణేష్, రాజబాబు నాయుడు, శివశంకర్, డేనియల్ విజయరాజ్, హనుమాన్ నాయక్, ఆదర్శపతక్ పాల్గొన్నారు.

# కార్యదీక్షతోనే ఉన్నత శిఖరాలు సాధ్యం

- ఎంబీయూలో ఘనంగా స్నాతకోత్సవ, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు
- హాజరైన ఉపముఖ్యమంత్రి బట్టి మోహన్ బాబు

**చంద్రగిరి, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** దేశంలోనే విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యను అందించడంలో మోహన్ బాబు విశ్వవిద్యాలయం అగ్రగామిగా ఉండడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మండలంలోని ఏ.రంగంపేట సాయి నగర్ లోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో మొదట స్నాతకోత్సవ, శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజ్ 13వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విక్రమార్క, ఛాన్స్ లర్, డాక్టర్ ఎం మోహన్ బాబు, సినీ నటుడు మంచు విష్ణువులు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల కార్యదీక్షతో ఉన్నత శిఖరాలకు ఎదిగి, స్థాయిని, హోదాను పక్కన పెట్టి పదిమందికి ఉపయోగపడేలా జీవితాన్ని



మలుచుకోవాలని సూచించారు. ఎం బి యూ ఛాన్స్ లర్ డాక్టర్ మంచు మోహన్ బాబు సినీ, విద్యారంగంలో కూడా నైపుణ్యాన్ని సాధించి అగ్రస్థానాన్ని సాధించడం గొప్ప విషయం అన్నారు. సేవా దృక్పథంతో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించి విద్యనందించడం అభినందనీయమన్నారు. మోహన్ బాబు విశ్వవిద్యాలయం ఛాన్స్ లర్, డాక్టర్ మంచు మోహన్ బాబు మాట్లాడుతూ 32 సంవత్సరాల కృషి ఫలితమే నేడు శ్రీ విద్యానికేతన్ విద్యా సంస్థలు యూనివర్సిటీ స్థాయికి చేరుకున్నాయని పేర్కొన్నారు. తన తల్లిదండ్రులు, తన గురువు దాసరి నారాయణరావు ఆశీస్సులతోనే ఈ స్థాయికి ఎదిగానని తెలిపారు.




ముఖ్యఅతిథి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క పేద బడుగు బలహీనవర్గాల ఆశా జ్యోతి అని మోహన్ బాబుని ఆయన కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథులు ఎం బి యూ,శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజీలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన పట్టభద్రులకు డిగ్రీ పట్టాలను పంపిణీ చేసి అభినందనలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రొ. ఛాన్స్ లర్ మంచు విష్ణు, ఉపకులపతి నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ సారధి, డీన్లు, ఆచార్యులు, అధ్యాపకులు, ఎంబీయూ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలలను సందర్శించిన ఎమ్మెల్యే డా.సంజీవ రెడ్డి

**నారాయణఖేడ్, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** విద్య మీద ప్రత్యక చొరవలో భాగంగా శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి మొదటి దశలో భాగంగా పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాల విద్యార్థుల మెరుగైన శిక్షణ అందించాలని హైదరాబాద్ కి చెందిన బెస్ట్ చైల్డ్ స్వచ్ఛంద సంస్థతో కలిసి 3 పాఠశాలల విద్యార్థులకు కంప్యూటర్ లు అందించి వారికీ ప్రత్యక శిక్షణ ఇచ్చేందుకు ఒప్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బెస్ట్ చైల్డ్ నిర్వాహకులతో కలిసి మూడు పాఠశాలలను పరిశీలించారు. అనంతరం శాసనసభ్యులు మాట్లాడుతూ నా 5 ఏళ్ళ పాలనా ముగిసే సరికి నియోజకవర్గం లోని ప్రభుత్వ విద్యను రాష్ట్ర స్థాయిలో మొదటి వరసలో ఉండేలా చేయడమే లక్ష్యం అన్నారు. బెస్ట్ చైల్డ్ సంస్థతో ఈ ప్రక్రియ ప్రారంభం అయిందని మరిన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిసి మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేలా ప్రయత్నిస్తానని తెలిపారు. కార్యక్రమంలో శాసనసభ్యులతో పాటు బెస్ట్ చైల్డ్



సంస్థ నిర్వాహకులు, పాఠశాల ఉపాధ్యాయులు, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



గోల్నాక డివిజన్ కమలానగర్ లో మండేపల్లి గంగపుత్ర సంఘం కమిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య గౌడ్.

*–గోల్నాక, ఆగస్ట్ 11 (నిఘా న్యూస్):*

# తల్లంపాడులో ఉచిత వైద్యశిబిరం

### ప్రారంభించిన తుంబూరు దయాకర్ రెడ్డి

**ఖమ్మం, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** తల్లంపాడు కాంగ్రెస్ గ్రామ కమిటీ, బిగ్ టీవీ, శ్రీ రక్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం శ్రీ రక్ష హాస్పిటల్ వైద్యబృందం స్థానికులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం



అభినందనీయమని అన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే.. వైద్యశాఖ అధికారులను అప్రమత్తం చేశారని తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు సమీప ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు కుమ్మరి అంబేద్కర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివారెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం పెద్ద తండా లో టెంపుల్ సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాదచారులు సేద తీరేందుకు బల్లాలను ఏర్పాటు చేయగా ఆ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామసహాయం నరేష్ రెడ్డి, రామ్మూర్తి నాయక్, హరి తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణ తీర్పును పునః సమీక్షించాలి

### మోదుమూడి గ్రామంలో దళిత సంఘం నేతల నిరసన



**అవనిగడ్డ, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** కృష్ణాజిల్లా అవనిగడ్డ అంటరానితనం సామాజిక వివక్షతలు అనుభవిస్తున్న సామాజిక వర్గాలు అందరూ సమానమేనని రాజ్యాంగం 341 ఆర్టికల్ అదే చెబుతుందని పార్లమెంటులో 341 ఆర్టికల్స్ సవరణ జరగకుండా ఆ వర్గాలను వర్గీకరించే హక్కు సుప్రీంకోర్టుకు లేదని తెలిపారు. ఇది రాజ్యాంగ పరిధికి దాటి ఇచ్చిన తీర్పుగా భావిస్తూ ఈ తీర్పును పున సమీక్షించాలని కోరారు. రాజ్యాంగ బద్ధంగా న్యాయస్థానాల్లో పోరాడుతామని ఇందుకు కొమ్ము కాస్తున్న మనువాద రాజకీయ పార్టీలపై ఉద్యమ కార్యాచరణకు పిలుపు నిస్తున్నట్టు నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన్, అంబేద్కర్ అభిమాని దాసి సీతారామరాజు, బొంతు ప్రకాష్, మద్దాల ధర్మారావు, మోదుమూడి గ్రామ పెద్దలు, అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు యువత సభ్యులు పాల్గొన్నారు.

# యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న పాలకులు




### డివైఎఫ్ఐ రాజకీయ శిక్షణ తరగతులు: నున్న నాగేశ్వరరావు

**ఖమ్మం, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** దేశంలో 60 శాతం గా ఉన్న యువశక్తిని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్న నాగేశ్వరరావు అన్నారు.డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు స్థానిక సత్తెనపల్లి రామకృష్ణ భవనంలో ఆదివారం ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా క్లాసుల ప్రారంభ సూచిక డివైఎఫ్ఐ పథకాన్ని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్ ఆవిష్కరించారు.



అనంతరం మద్దాల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో పాల్గొన్న రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్న నాగేశ్వరరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు మీడియం బాబురావులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువశక్తిని ఉపయోగించుకున్న దేశాలే అభివృద్ధి చెందుతాయని, పలుదేశాలు యువతను ప్రోత్సహిస్తుంటే మన దేశంలో మాత్రం పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. దీనివలన అభివృద్ధిలో వెనుక పడుతుందని అన్నారు. ఈ రాజకీయ శిక్షణ తరగతుల్లో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, జిల్లా నాయకులు చింతల రమేష్, శిలం వీరబాబు, సత్తెనపల్లి నరేష్, కొంగర నవీన్, సుజాత, కూరపాటి శ్రీను, భూక్య ఉపేందర్ నాయక్,షేక్ పాషా కనకాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప బోనాలు

### భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న మహిళలు



**అడ్డగూడూరు, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** అడ్డగూడూరు మండల కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రోజున కురుమల కుల దైవమైన బీరప్ప బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఒగ్గు కళాకారుల డోలు చప్పులతో, ఆటపాటలతో, పోతురాజుల విన్యాసాలతో, శివసత్తుల సిగాలతో బీరప్ప దేవునికి భక్తి శ్రద్ధలతో బోనాల సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలతో చల్లగా చూడాలని ఆలయంలో పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం పెద్దలు మహిళలు యువతి యువకులు ఒగ్గు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలి

- గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలి
- ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్

**వరంగల్, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** వరంగల్ నగరంలోని ఉరిసుగుట్ట జంక్షన్ యందు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ హాస్టల్ పరిస్థితి అధ్వానంగా తయారైందని కాస్మోటిక్ చార్జీలు పేరుకే తప్ప విద్యార్థులకు సరిపోవడం లేదని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం ఉరుసుగుట్టలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశం ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎల్ మూర్తి అధ్యక్షతన జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి సాంఘిక సంక్షేమ హాస్టల్లో పరిస్థితి అధ్వానంగా తయారయింది. ఈ ప్రభుత్వం గురుకులాల పైన కన్నతల్లి ప్రేమ చూపెడుతుంది సంక్షేమ హాస్టళ్ల పైన సవతి తల్లి ప్రేమ చూపెడుతుందని అన్నారు. సామాజిక తరగతులకు చెందిన ఎస్సీ ఎస్టీ, బీసీ విద్యార్థులు వసతి పొందుతూ చదువుకుంటున్న ఆహార పౌష్టికాహార లోపం స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. విద్యార్థులకు అందించాల్సిన




ఆహార పదార్థాలు నాణ్యత ప్రమాణాలు ఉండడం లేదని అన్నారు. ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచక పోవడంతో హాస్టల్ వార్డెన్ సైతం ఉన్నంతవరకు పూట గడిచేలా చూస్తున్నారని అన్నారు. సరుకుల ధరలన్నీ నిత్యం పెరుగుతూ ఆకాశాన్నంటాయి దాంతో హాస్టల్ విద్యార్థుల మెనూ గోడలపై బోర్డులకే పరిమితమైంది వంట గదిలో కనిపించట్లేదు ధరల పెరుగుదల వల్ల నాసిరకం కూరగాయలు నాణ్యతలేని నూనెలు, పప్పులు, చికెన్ పెడుతున్న పరిస్థితి ఉన్నది అదేవిధంగా గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేక విద్యార్థులు అద్దె భవనంలో మగ్గడం మంచినీళ్లు కూడా సరిగా లేక పస్తులతో అలమటిస్తున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెరగకపోవడంతో విద్యార్థులు అరకొర సదుపాయాలతో కాలమెల్లదీస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న మెస్ చార్జీలకు పొంతన లేకుండా పోయింది. సర్కార్ పైసలు దేనికి సరిపోక పోవడంతో నాసిరకం భోజనం పెడుతున్నారని అన్నారు. అదేవిధంగా గురుకులాల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని పదేపదే ప్రభుత్వం చెబుతుంది కానీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ గురుకుల లో విద్యార్థులకు అత్యుత్తమ విద్యా బోధన జరుగుతుందని ఘనంగా చెప్పుకుంటుంది. గురుకులాల గురించి ఇంత గొప్పగా చెబుతున్న ప్రభుత్వం సొంత భవనాలు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం విఫలం అవుతుంది రాష్ట్ర వ్యాప్తంగా గురు కులాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాలు అరకోర సౌకర్యాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత ఆరు సంవత్సరాలుగా ఉన్నటువంటి స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజులు రాలేదని పేరుతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఉన్నత చదువులకు వెళ్లాలని విద్యార్థులు తల్లిదండ్రులు సర్టిఫికెట్ కోసం వడ్డీలకు అప్పులు చేస్తున్న దుస్థితి రాష్ట్రంలో నెలకొందని అన్నారు. స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వాటిని విడుదల చేసినందుకు ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ మార్గదర్శకాలు ప్రభుత్వమే అమలు చేయడం లేదని అన్నారు. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు తక్షణమే స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్, శ్రీకాంత్ వర్మ, సంతోష్, శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత, దాసరి ప్రశాంత్, ప్రశాంత్ గజ్జెల శ్రీకాంత్ గర్ల్స్ కన్వీనర్ పూజ, సోషల్ మీడియా కన్వీనర్ దామెర కిరణ్ రాష్ట్ర కమిటీ సభ్యులు చుక్క ప్రశాంత్ యార ప్రశాంత్, పాల్గొన్నారు.

మల్కాజిగిరి సర్కిల్ పరిధి ఆర్.కె.పురం సంతోష్ కాలనీలోని నల్ల పోచమ్మ దేవాలయంలో ఆదివారం జరిగిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు ముఖ్య అతిథిగా హాజరైనారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



*–మల్కాజిగిరి, ఆగస్టు 11 (నిఘా న్యూస్):*

# ఖమ్మం జిల్లా వరదాయిని సీతారామ ప్రాజెక్టు

- 15న సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభోత్సవం
- ట్రయల్ రన్ విజయవంతంపై హర్షం
- ఏటా 6లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- దోపిడి లక్ష్యంతోనే రీడిజైన్ చేసిన కేసీఆర్ ప్రభుత్వం: పొంగులేటి
- నెరవేరనున్న గోదావరి జలాల సరఫరా కల: తుమ్మల



**ఖమ్మం, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి వరదాయిని సీతారామ ప్రాజెక్టు అని, ఈ ప్రాజెక్టును ఈ నెల 15న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకోబోతున్నామని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.ఆదివారం సీతారామ ప్రాజెక్ట్ పూసుగూడెం ట్రయల్ రన్ ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. అనంతరం పుసుగూడెం, కమలాపురం పంపుహౌస్‌లను మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మీడియాతో మాట్లాడారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ 3 పంపు హౌస్‌లు ప్రారంభానికి సిద్ధంగా వున్నట్లు తెలిపారు. పూసుగూడెం పంప్‌హౌజ్ ట్రయల్ రన్ విజయవంతమైందని, ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. సీతారామ ప్రాజెక్టు 2,3లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌజ్‌లను సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15న ఖమ్మం జిల్లా వైరాలో భారీ బహిరంగ సభలో ప్రారంభిస్తారని తెలిపారు. అదే సభలో రైతుల 2లక్షల రుణమాఫీ ప్రకటన చేస్తారని పేర్కొన్నారు. ఏటా 6లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలన్న సంకల్పంతో తమ ప్రభుత్వం ముందుకెలుతుందన్నారు. 2026ఆగస్టు 15నాటికి ప్రతి ఎకరాకు నీరందించే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకి గత ప్రభుత్వ హయంలో ఎలాంటి అనుమతులు లేవని, నీటి కేటాయింపులు లేవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సెంట్రల్ వాటర్ కమిషన్‌ని, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి సీతారామకు అన్ని రకాల అనుమతులు తీసుకున్నామని మంత్రి వెల్లడించారు. 67 టీఎంసీల గోదావరి జలాలు సీతారామకు కేటాయించేలా కృషి చేశామని వివరించారు. ఏన్కూరు లింకు కెనాల్‌కు రాజీవ్ కెనాల్‌గా నామకరణం చేసి శరవేగంగా పనులు పూర్తి చేశామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.8 వేల కోట్లు సీతారామ ప్రాజెక్ట్‌కు ఖర్చుచేసి కనీసం పంపులు ఏర్పాటు చేయలేదని, సీతారామ పరిధిలో ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేదని విమర్శించారు. 15 ఆగస్ట్ 2026 నాటికి సీతారామ ప్రాజక్ట్ పూర్తి చేసి పూర్తి స్థాయిలో వినియోగానికి తీసుకొస్తామని, సీతారామకు సంబంధించి 1,658 ఎకరాల భూసేకరణ చేయాల్సిన అవసరం ఉందని, జిల్లా ప్రజలు సహకరిస్తే భూసేకరణ సేకరణ పూర్తి చేసి ప్రాజక్ట్ పూర్తి చేస్తామన్నారు. రెండు సంవత్సరాలలో సీతారామను పూర్తి చేసి పది లక్షల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలను అందిస్తామని తెలిపారు. ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏన్కూర్ లింక్ కెనాల్ ప్రారంభిస్తారని, ఆగస్టు 15న 2 లక్షల రుణమాఫీని పూర్తి చేస్తామని ఉత్తమ్ వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో వేలకోట్ల దోపిడి: పొంగులేటి ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం చిరకాల వాంఛ ఈనెల 15న నెరవేరబోతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గోదావరి నీటిని కృష్ణా పరీవాహక ప్రాంతానికి తీసుకొచ్చే సీతారామ ప్రాజెక్ట్‌ను ముఖ్య మంత్రి



రేవంత్ రెడ్డి ప్రారంభించబోతున్నారని ప్రకటించారు.గోదావరి జలాలను కృష్ణా జలాలను అనుసంధానం చేయనున్నామన్నారు. రూ.2,400 కోట్లతో ప్రతిపాదించిన రాజీవ్‌సాగర్ ఇందిరా సాగర్ ప్రాజెక్టునుకే సీఆర్ ప్రభుత్వం రీడిజైన్ పేరుతో రూ.18,000 కోట్లకు పెంచి దోచుకున్నారన్నారు. రేవంత్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన చేయించి పూర్తి చేస్తోందని, అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, రాజీవ్ కెనాల్ ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించబోతున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి రైతాంగానికి అప్పజెప్పుతున్నామన్నారు. కేంద్రంతో మాట్లాడి కేంద్ర మంత్రులను ఒప్పించి సీతారామకు 67 టీఎంసీల నీటిని కేటాయిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో విడుదల చేయించిందని, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృషి ఫలితంగా సీతారామకు గోదావరి జలాల కేటాయింపు జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలలో 5 గ్యారంటీలు ఇప్పటికే అమలు చేశామని, ఆగస్ట్ 15న ముఖ్య మంత్రి రేవంత్ రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తారని చెప్పారు. ధరణి పేరుతో కేసీఆర్ ప్రభుత్వం పేదల భూములు దోచుకుందని, రెవెన్యూ చట్టాన్ని సవరించి కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొచ్చి ప్రజల ముందు ఉంచామని, త్వరలోనే అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తామన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆ కష్టాలు సమస్యలు అన్నింటిని అధిగమించి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని చెప్పారు. సీతారామం ప్రారంభోత్సవంతో నెరవెరనున్న కల: మంత్రి తుమ్మల, సీతారామం ప్రాజెక్టు ప్రారంభోత్సం రోజు ఎంతో సంతోషకరమైన రోజని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఆగస్ట్ 15న సీతారామ ప్రాజెక్ట్ సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం అవుతుందని, జిల్లా ప్రజలకు గోదావరి జలాలు అందించాలన్న కల నెరవెరబోతుందన్నారు. ఇందిరా సాగర్ భూభాగం ఆంధ్రా లో కలవడం రాజీవ్ సాగర్ అటవీ ప్రాంతం సమస్యలు వల్ల సీతారామ ప్రాజెక్ట్ కు రూపకల్పన జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో ప్రాజెక్ట్ పనులు నత్తనడకన సాగాయన్నారు. పంప్ హౌస్ ల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కాలువలు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. కృష్ణా జలాలు సకాలంలో రాకపోతే ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో వైరా లింక్ కెనాల్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సత్తుపల్లి ట్రంక్ పనుల్లో యాతాలకుంట టన్నెల్ పూర్తి చేయాలన్నారు. జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తయితే పాలేరు వరకు గోదావరి జలాలు చేరతాయన్నారు.

## తీజ్ ముగింపు వేడుకల్లో దయాకర్ రెడ్డి ఆట పాట



**ఖమ్మం, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** మండలంలోని సాయి గణేష్ నగర్ లో ఆదివారం బంజారాల తీజ్ పండుగ ముగింపు వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బంజారాలతో కలిసి ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో అజ్మీర అశోక్ నాయక్, తుమ్మలపల్లి నరేందర్, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, బానోత్ సాయి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పకు సిపిఐ జన్మదిన శుభాకాంక్షలు

### ఘనంగా అయ్యప్ప జన్మదిన వేడుకలు



**మధిర, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** సిపిఐ నాయకులు అన్నవరపు సత్యనారాయణ కుమారుడు అయ్యప్ప జన్మదిన వేడుకలను మండల పరిధి మడుపల్లిలో ఆదివారం పార్టీ శ్రేణులు కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. అయ్యప్ప జన్మదిన వేడుకల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్మల జితేందర్ రెడ్డి, తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు ఫంగ శేషగిరిరావు తదితరులు పాల్గొని అయ్యప్ప చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు అన్నవరపు సత్యనారాయణ కుటుంబీకుల విలవేల్పు అయినా ఉప్పలమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు సత్యనారాయణ కుటుంబీకులు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ లో అఖిలభారత యాదవ మహాసభ

### మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు మహేశ్వరి యాదవ్



**తిరుపతి, అగస్టు 11 (నిఘా న్యూస్):** అఖిల భారత యాదవ మహాసభ1922 24 లో ప్రారంభించి ఇప్పటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రానున్న నవంబర్ నెలలో శ్రీవారి పాదాల చెంత తిరుపతిలో ఘనంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు మహేశ్వరి యాదవ్ తెలియజేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆదివారం మీడియాతో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు విచ్చేయుచున్న ఈ సభకు దేశంలోని ప్రధాన యాదవ నేతలు హాజరు కానున్నారని వెల్లడించారు.ఈ మహాసభను యాదవులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో శేషుపాని, నాగమల్లేశ్వరి, దత్తుయాదవ్, శివా,లక్ష్మీప్రసాద్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రను తిరగ రాసిన పవన్ కళ్యాణ్

- ఏపీలో వాడవాడలా ఘనంగా స్వతంత్ర వేడుకలు
- జనసేన నేత కిరణ్ రాయల్

**తిరుపతి, అగస్టు 11 (నిఘా న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, భారతదేశం గర్వించే విధంగా పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ భారీగా నిధులను విడుదల చేసి ఘనంగా వాడవాడలా స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారని ఇది దేశం గర్వించదగ్గ విషయమని జనసేన పార్టీ తిరుపతి ఇంచార్జ్ కిరణ్ రాయల్ ఆశాబావం వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆదివారం మీడియా ముందు జనసేన నాయకులు సుమన్ బాబు, మనోజ్, కిషోర్, ఆది,వినోద్, శ్రీనివాసులు, సుమంత్, లోకేష్, సుధాకర్,మురళి తదితరులతో కలిసి కిరణ్ రాయల్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పుడు. ప్రోగ్రామ్ లకు విడుదల చేసిన ఫండ్స్ లను దిగమింగి, తూ తూ మంత్రంగా జరిపే వాళ్ళని గుర్తు చేశారు. గత 34 సంవత్సరాలుగా పంచాయతీలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు వంద, రెండు వందల రూపాయల నిధులను విడుదల చేసే చరిత్రను పవన్ కళ్యాణ్ తిరగరాసారని, మైనర్ పంచాయతీ కి 10 వేల మేజర్ పంచాయతీ కి 25 వేల చొప్పున నిధులు విడుదల చేయించడం హర్ష నీయమన్నారు. ఈ జీవోను విడుదల



చేసినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ధన్యవాదాలు తెలిపారు. ప్రెస్ మీట్ అనంతరం దువ్వాడ శ్రీనివాస్ గురించి ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా గత వైసిపి ప్రభుత్వంలో తమ జనసేనాని ని మూడు పెళ్లిళ్లు చేసుకున్నారని విమర్శించారని. ఇది కర్మ సిద్ధాంతం అని, కర్మ సిద్ధాంతం ఎవ్వరిని విడిచిపెట్టదని, దువ్వాడ జగన్నాథం సినిమా ఎంత హిట్టో అంతకుమించి దువ్వాడ శ్రీనివాస్ పెళ్లిళ్ల బాగోతం. సూపర్ దూపర్ హిట్టుగా ఈ దువ్వాడ శ్రీనివాస్ పెళ్లిళ్ల,కర్మ సిద్ధాంతం అంతర్జాలంలో మారు మ్రోగుతున్నదని చురకలు విసిరారు.

## ఆగస్టు 31న.. టియుడబ్ల్యూజే రాష్ట్ర సభలు

### టి యు డబ్ల్యూ జే (ఐ జేయు)రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు

**సూర్యాపేట, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హెచ్ 9/2014) రాష్ట్ర సభలు ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీలలో సూర్యాపేటలో నిర్వహిస్తున్నట్లు టి యు డబ్ల్యూ జే ఐ జే యు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కోల నాగేశ్వరరావు, డాక్టర్ బంటు కృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మిక్కిలినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టియుడబ్ల్యూజే ఐజేయు యూనియన్ సమావేశంలో వారు మాట్లాడారు. తమ యూనియన్ ఏర్పడిన 67 సంవత్సరాలుగా జర్నలిస్టుల పక్షాన అనేక సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ జర్నలిస్టుల హక్కులు, బాధ్యతలు కోసం పోరాటం చేస్తున్నామని చెప్పారు. సూర్యాపేటలో గతంలో ముఖ్యమంత్రులుగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు, నేదురుమల్లి జనార్దన్ రెడ్డిని ఆహ్వానించి రాష్ట్ర మహాసభలను సూర్యాపేటలో జరిపిన ఘనత తమ యూనియన్ కు దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు హయాంలో తొలిసారిగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యం, నేదురుమల్లి జనార్దన్ రెడ్డి హయాంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇప్పించిన ఘనమైన పోరాట చరిత్ర ఐజేయుది అన్నారు. మూడవసారి కూడా రాష్ట్ర యూనియన్ సభలను సూర్యాపేటలో నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈసారి కూడా రాష్ట్ర సభలను విజయవంతం చేయడానికి సహకారం



అందించాలని కోరారు. ఇంకా ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఎలక్ట్రానిక్ మీడియా సూర్యాపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బత్తుల మల్లికార్జున్, రెబ్బా విజయకుమార్, సిరికొండ సైదులు, కోశాధికారి తల్లాడ చందన్, ముషం హరి, ఫణి నాయుడు, వార్త శ్యాం కుమార్, దేవరశెట్టి వేణుమాధవ్, నాగరాజుగౌడ్, ఏబీఎన్ మల్లేష్ గౌడ్, గుడి పూరి రామకృష్ణ గౌడ్, జనార్ధన చారి, మధు, కొండ్లె కృష్ణయ్య, శిరం శెట్టి ఆనంద్, బొల్లెద్దు వెంకటరత్నం, ఉయ్యాల నరసయ్య గౌడ్, పల్లె మణి బాబు, నాగరాజు, రామకృష్ణ, నరేందర్, కొండా శ్రీనివాస్, ప్రవీణ్, జహీర్, రమేష్, వాసా చంద్రశేఖర్, రామచంద్ర రాజు, కాటం గౌడ్, సుమన్, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కంగ్టిలో ఉచిత వైద్య శిబిరం

**కంగ్టి, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** కంగ్టి లో తెలంగాణ ప్రభుత్వం ఆయుష్ శాఖ అధ్వర్యంలో వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆయుష్ వైద్యాధికారి నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరం కంగ్టి గ్రామపంచాయితీ లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు.

## గౌడవెల్లి రైల్వే స్టేషన్ లో విషాదం



**మేడ్చల్, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** మేడ్చల్ గౌడవెల్లి రైల్వేస్టేషన్ సమీపంలో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు రైలు ఢీకొని తండ్రితో సహా ఇద్దరు కుమార్తెలు మృతి చెందారు. రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన రైల్వే లైన్మెన్ కృష్ణ తన కూతుళ్లను ట్రాక్పై కూర్చోబెట్టి పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ ట్రాక్పైకి ట్రైన్ రావడంతో గమనించి పిల్లలను కాపాడబోయినా సాధ్యపడలేదు. రైలు ఢీకొని ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు.



**బోనాల పండుగ సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని శ్రీశ్రీశ్రీ ఊర ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి**
**కొప్పుల వేణారెడ్డి.**

*-సూర్యాపేట, ఆగస్టు 11 (నిఘా న్యూస్):*

## కాంటూర్ తో సంబంధం లేకుండా పరిహారం ఇవ్వండి

### సంయుక్త సమావేశం నిర్వహిస్తామన్న మంత్రి నిమ్మల

**కుక్కునూరు, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పరిహారం ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి అన్నారు. పాలకొల్లులో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో సీపీఎం బృందం నిర్వాసితుల సమస్యలుపై గంటన్నార పాటు చర్చించి అనంతరం సమస్యలుతో కూడిన వినతిపత్రాని అందజేశారు. ఈ సందర్భంగా ఏ.రవి మాట్లాడుతూ నిర్వాసితుల త్యాగాల పునాదులపై పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తూనే ఉన్నాయని. కాని ప్రాజెక్టు నిర్మించడంలో ఉన్న శ్రద్ధ నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో లేదని అన్నారు. ఫలితంగా ఈ 15 ఏళ్ళలో ప్రాజెక్టు నిర్మాణం 75 శాతంపైగా పూర్తికాగా పునరావాస కల్పన 10 శాతం కూడా మించలేదని. పునరావాసం కల్పించిన వారికి సైతం అరకొరగానే సాగిందని అన్నారు. పోలవరం ప్రాజెక్టులో ముంపుకు గురయ్యే ప్రాంతాలను ప్రభుత్వాలు అశాస్త్రీయంగా గుర్తించాయని. 2022 జూలైలో వచ్చిన వరదల్లో 41.5 కాంటూరు పైబడిన గ్రామాలు సైతం మునిగి పోయాయి. ఏలూరు జిల్లాలో పోలవరం కుకునూరు వేలేరుపాడు



మండలాల్లోని 25 వేల కుటుంబాలు, లక్ష మంది నిర్వాసితులౌతున్నారు. వీరిలో అత్యధికులు గిరిజనులే. వీరికి పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో పునరావాస కాలనీలు నిర్మించారు. సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. ఒక్క కుటుంబానికి కూడా పూర్తి స్థాయిలో పునరావాసం కల్పించలేదని, నూతన ప్రభుత్వం స్పందించి పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పంచాయితీలకు కాలనీలు అప్పచెప్పి వాటికి అవసరమైన నిధులు కేటాయింపులు చెయ్యాలని, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల నుండి తరలించిన నిర్వాసితులకు ఆ గ్రామ పరిధిలోకి బ్యాంక్ ఇతర సేవలు మార్చాలని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఆర్%డ%ఆర్ ప్యాకేజి తక్షణమే గత ప్రభుత్వం ఇచ్చిన హామీ 10 లక్షలు చెల్లించాలని, 2022 ముంపు ఆధారంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు పరిహారం చెల్లించాలని, కాంటూర్ తో సంబంధం లేకుండా పునరావాస కాలనిలకు తరలించి ఆలోట్మెంట్ ఆర్డర్ ఇవ్వాలని, ఎర్ర కాలువ రిజర్వాయర్ మిగులు భూములు స్థానిక పేదలకు సాగుకు ఇవ్వాలని అన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ నిర్వాసితుల గ్రామాలు వరదలు సమయంలో పర్యటన చేశామని, నిర్వాసితులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీలైనంత త్వరగా నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇచ్చి సమస్యలు పరిష్కారం చేసేలా చూస్తామని, అధికారులతో నిర్వాసితుల నాయకుల సంయుక్త సమావేశం నిర్వహిస్తామని, ఎర్ర కాలువ రిజర్వాయర్ భూములపై విచారణ జరిపి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మానుకొండ జీవరత్నం మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



పామర్రు నియోజకవర్గ ఇండియా కూటమి పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి, పామర్రు నియోజకవర్గ బీజేపీ ఇంఛార్జి అంగాడల సతీష్ పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. కృష్ణా జిల్లా బీజేపీ కార్యదర్శి సింగవరపు భాస్కర్ బీజేపీ మువ్వ మండల అధ్యక్షులు కిరణ్ కో కన్వీనర్ రమేష్ పామర్రు మండల ప్రధాన కార్యదర్శి శివ కృష్ణ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు.

*-పామర్రు, ఆగస్టు 11 (నిఘా న్యూస్):*

## ధర్మపురంలో ఘనంగా బోనాల పండుగ



**మోత్కూరు, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** మున్సిపాలిటీ లోని ధర్మపురం గ్రామంలో ప్రజలు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామం ఆనవాయితీ ప్రకారం ముత్యాలమ్మ కు బోనాలు సమర్పించి మేకపోతులను బలి ఇచ్చారు. అనంతరం ముత్యాలమ్మ తల్లికి మండల కాంగ్రెస్ నాయకులు జినకల కనకయ్య మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో మోత్కూర్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగొని రామచంద్రు,యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కారుపోతుల వెంకట్,కళ్లెం నర్సయ్య,గ్రామ పెద్దలు వర్రే లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డిని కలిసిన జనుంపల్లి



**ఉప్పల్, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డిని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనతో హైదరాబాద్ ప్రపంచ స్థాయి లైఫ్ సెన్స్ హబ్ గా తీర్చిదిద్దాలన్న ఆలోచనలకు ఈ పెట్టుబడులు దోహదపడతాయన్నారు. వేలాది ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

# డ్రైనేజీ కాలువలపై నిర్మాణాలకు విద్యుత్ మీటర్లు

- అక్రమ నిర్మాణాలకు అధికారుల అండదండలు
- ముంపు ఇండ్లను సందర్శించిన ఎమ్మెల్యే పులివర్తి నాని
- వెంటనే కరెంట్ సర్వీసులను తొలగించాలని ఆదేశం



**తిరుపతి, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** డ్రైనేజ్ కాలువలను ఆక్రమించి, వాటోపైన నిర్మించుకున్న అక్రమ ఇండ్లకు అధికారులు తమ అండదండలందించటం ఏమిటని చంద్రగిరి ఎంయల్ఏ పులివర్తి నాని అధికారులపైన ఆగ్రహం వ్యక్తం చేసారు.గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి తిరుపతి రూరల్ మండలం,ఉమ్మడి మంగళం తిరుమల నగర్ పంచాయతీ కేబీఆర్ నగర్ లో ముంపునకు గురైన ఇళ్లను అధికారులతో కలిసి ఆదివారం నాని పరిశీలించారు. ఇండ్లు ముంపుకు కాలువలు ఆక్రమణ, అక్రమ నిర్మణాలేనని స్థానికులు ఎంయల్ఏ దృష్టికి తీసుకుని అందులో వచ్చారు. కాలనీ అంతా తిరిగి పరిశీలించారు. డ్రైనేజ్ కాలువలపైన అక్రమంగా నిర్మించుకున్న ఇండ్లకు కరెంట్ సర్వీసులు ఇచ్చి వుండటం గమనించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నిర్మించిన ఇండ్లకు ఏ ఆధారాలతో కరెంట్ మీటర్లు మంజూరు చేసారని అధికారులపై ఎంయల్ఏ మండిపడ్డారు. వెంటనే కరెంట్ సర్వీసులను రద్దుచేసి,ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. అక్రమదారులపైన తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇలాంటి కట్టడాల వలన నివాసాలు వర్షపు నీళ్ళు వెలుపలికి పోలేక ముంపుకు కారణం అవుతున్నయన్నరు. ఇలాంటి అక్రమ కట్టడాలకు అధికారులు అండదండలు అందించడం మానుకొని ప్రజాసేవకు పాటుపడాలని హితవు పలికారు. ముంపుకు గురైన వారికి ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్

## జి.నరసింహా యాదవ్



**తిరుపతి, అగస్టు 11 (నిఘా న్యూస్):** ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని తిరుపతి టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్ అధికారులకు సూచించారు. స్థానిక టిడిపి తిరుపతి పార్లమెంటు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్, ప్రజా సమస్యలకు పరిష్కారం కార్యక్రమానికి తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్ అధ్యక్షతన ప్రజలు సమస్యలపై అర్జీల రూపంలో విన్నవించుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు, ఈరోజు ప్రధానంగా శెట్టిపల్లె భూముల సమస్యలపై సుమారు 3000 మంది తమగోడును విన్నవించుకొన్నారని ఆయన అన్నారు. అలాగే తిరుమల లోని ఆర్ బి సెంటర్ లో సుమారుగా 50 సంవత్సరాల నుండి నివసించుతున్న 84 ఇండ్లను డిస్టర్బ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దానిపై వినతిపత్రాలు అందజేశారని ఆయన అన్నారు. టిడ్కోఇళ్ల కు సంబంధించి వెంటనే కేటాయించాలని అర్జీ దారులు మొరపెట్టుకున్నారు, వైసిపి హయాంలో ఆక్రమణకు గురైన చెరువులను సర్వే చేపించి వెంటనే చెరువుకు అభివృద్ధి చెందేందుకు రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు, వైఎస్ఆర్సిపి పార్టీ హయాంలో ఏదైతే గవర్నమెంట్ స్థలాల్లో ఇల్లీగల్ హౌసెస్ నిర్మించారు దాన్ని వెంటనే తొలగించాలని అర్జీలు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. కడప నుండి రేణిగుంట నేషనల్ హైవే 716 రోడ్డు విస్తీర్ణంలో భాగంగా ఇండ్లను, జాగాలను కోల్పోయిన వారివి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి నష్టపరిహారాన్ని చెల్లించేందుకు లంచం ఇవ్వలేదని వారికి రావాల్సిన నష్టపరిహారాన్ని రానివ్వకుండా అడ్డుకోవడం జరిగింది దీనిపై 20 అర్జీలు ఇచ్చి వారి ఇబ్బందులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ చేజర్ల మనోహర్ ఆచారి, కార్యాలయం కార్యదర్శి, ఊట్ల సురేంద్రనాయుడు, జిల్లాకార్యదర్శి, చెంబకూరు రాజయ్య, పార్లమెంట్ మీడియా కో-ఆర్డినేటర్, చిత్తూరు రవిశంకర్, శంకర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మూత్రపిండాల రాళ్లను నిర్లక్ష్యం చేయొద్దు

### జనరల్ మెడిసిన్ డాక్టర్.గాయత్రి



**వికారాబాద్, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడితే నిర్లక్ష్యం చేయకుండా, త్వరితగతిన నాణ్యమైన వైద్యం చేయించుకుంటే మూత్రపిండ వ్యవస్థ సురక్షితంగా ఉంటుందని జనరల్ మెడిసిన్ డాక్టర్ శ్రీ సాయి గాయత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జనరల్ ప్రభుత్వ ఆసుపత్రిలోఆసుపత్రిసూపరింటెండెంట్, ప్రొఫెసర్ రామచంద్రయ్య ఆధ్వర్యంలో వైద్యనిపుణులు ఆసుపత్రికి అనారోగ్య సమస్యలతో వచ్చిన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. మూత్ర విసర్జనలో నొప్పిగా అనిపించడం, మూత్రం ఎర్రగా రావడం, మూత్రం ఆగి, ఆగి రావడం, వెన్నెముక భాగాన నొప్పి రావడం తదితర లక్షణాలు కనిపించిన వెంటనే, నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత డాక్టర్లను సంప్రదించి, డాక్టర్ల సూచనల ప్రకారం మూత్ర పరీక్షలు, అల్ట్రాసౌండ్, ఎక్స్ రే పరీక్షలు చేయించుకోవాలని స్పష్టం చేశారు. పైన సూచించిన వైద్య పరీక్షల ఫలితాల ద్వారా రాళ్ల పరిమాణాలు ఎంత మోతాదులో ఉన్నాయి. అనే విషయం నిర్ధారణ అవుతుందని వెల్లడించారు. రాళ్ల పరిమాణాన్ని బట్టి వైద్య సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. చిన్న పరిమాణంలో రాళ్లు ఉంటే అధికంగా నీరు త్రాగడం వలన మూత్రంలో విసర్జించబడతాయని వెల్లడించారు. నొప్పి తక్కువ కావడానికి మాత్రలు అందించడం జరుగుతుందని తెలిపారు. రాళ్ల పరిమాణం అధిక మోతాదులో ఉంటే శస్త్ర చికిత్స , ఎండోస్కోపీ ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం కిడ్నీ కి అనారోగ్య సమస్య ఏర్పడుతుందని గుర్తు చేశారు. ఆరోగ్య నియమావళిలో భాగంగా మనిషి రోజుకు నాలుగు లీటర్ల మంచినీరు త్రాగడం అలవాటు చేసుకోవడం ఉత్తమమైన మార్గమని హితవు పలికారు. రోజుకు నాలుగు లీటర్ల చొప్పున మంచి నీరు త్రాగితే కిడ్నీ వ్యవస్థ సురక్షితంగా ఉంటుందని భరోసా కల్పించారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వలిగొండ, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ఆదివారం అరూరు గ్రామంలో పుర్మ కృష్ణ అనారోగ్యం కారణాల వల్ల మరణించాడు, కృష్ణ కుటుంబానికి పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మాజీ జెడ్పిటిసి వాకిటి పద్మ అనంత రెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అనంత రెడ్డి, వాకిటి శరత్ పవన్ రెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ మాజీ ఉప సర్పంచ్ సుక్క ముత్యాలు, జనరల్ సెక్రటరీ కోడితల కరుణాకర్, సుంకిశాల పరమేశ్ పోలెపాక నరసింహ దమెర అంజయ్య ఎం ముత్యాలు జకిడి నర్సిరెడ్డి, కసరబోయిన మహేష్, కె.మధు, సిహెచ్ సీను, పోలెపాక చెమ్మయ, బుర్ర శ్రీను,కాదరి నరేష్, జె.రాజు, ఎం గణేష్, నల సత్తయ్య, వేముల ఎట్టయ్య, వేముల నరసింహ, వేముల రమేష్, రాజు, జినుకల దానయ్య, ఫకీర, అజగర్, రమేష్ మహేష్ వేముల చిన్న నరసింహ, సిహెచ్ ఉపేందర్, రెబ్బసు నరేష్,జోలం సిద్ధయ్య, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మీకోసం ఫిర్యాదుల పరిష్కార వేదిక

### తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి, అగస్టు 11 (నిఘా న్యూస్):** ఆగస్ట్ 12 వ తేది సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో మీకోసం-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఉ.10 గం.ల నుండి మ.1 గం.వరకు నిర్వహించనున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి సోమవారం మీకోసం-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించబడుతుందని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఎన్.మౌర్య తెలిపారు.

## మంద కృష్ణమాదిగ ర్యాలీని జయప్రదం చేయండి



**బాలాపూర్, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** ఎస్సీ వర్గీకరణ చేయాలని మాదిగలకు అనుకూలంగా వచ్చిన సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ ఢిల్లీ నుంచి వస్తున్న సందర్భంగా జరిగే భారీ ర్యాలీకి బాలాపూర్ మండలంలో ఉన్న మాదిగ, మాదిగ ఉప కులాలు అందరూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమయ్యే భారీ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు బొర్ర రవి మాదిగ పిలుపునిచ్చారు.

## ట్రాక్టర్ - బైక్ ఢీ.. వ్యక్తి దుర్మరణం



**అశ్వారావుపేట, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** అశ్వారావుపేట మండలం వినాయకపురం పెట్రోల్ బంక్ వద్ద ట్రాక్టర్ - ద్విచక్ర వాహనం ఆదివారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడిపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో ఆంధ్రప్రదేశ్ లోని కుక్కునూరుకు చెందిన ఘంటసాల శ్రీనివాస్ చాతిపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో బాడీ నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతి చెందాడు.స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో చింతా రమణమూర్తి అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా హాస్పిటల్ కి తరలించారు.

## డిప్టేషన్ పై వెళ్తున్న కానిస్టేబుల్ కు సన్మానం



**పెబ్బేరు, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** పెబ్బేరు పట్టణ కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న రైటర్ కానిస్టేబుల్ ఆనంద్ డిప్టేషన్ పై హైదరాబాద్ కు వెళ్లడం జరిగిందని ఆదివారం ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా హైదరాబాదులో టీజీ ట్రాన్స్ కోలో హైదరాబాద్ కు వెళ్లడంతో ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి పోలీస్ సిబ్బంది శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కానిస్టేబుల్ ఆనంద్ మాట్లాడుతూ పెబ్బేరు పోలీస్ స్టేషన్ లో గత కొన్ని సంవత్సరాల నుండి ఎన్నో సెల్ ఫోన్లు మిస్సింగ్ కావడంతో బాధితుల ఫిర్యాదు మేరకు ట్రేస్ అవుట్ చేసి దొరికిన ఫోన్లను తిరిగి బాధితులకు అప్పగించడం జరిగిందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.బదిలీపై హైదరాబాద్ వెళ్లడం జరిగిందని తెలిపారు.కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అంబర్ పేటలో అద్దెకు ఫుట్ పాత్‌లు

- అద్దెలు వసూలు చేస్తున్న రాజకీయ బ్రోకర్లు
- భాగస్వామ్యం అవుతున్న ట్రాఫిక్ పోలీసులు జిహెచ్ఎంసి అధికారులు




**అంబర్‌పేట్, ఆగస్ట్ 11(నిఘా న్యూస్):** బాగ్ అంబర్ పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఫుట్ పాత్ లను ఆక్రమించుకుని కొందరు వ్యాపారాలు కొనసాగిస్తున్న జిహెచ్ఎంసి అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు సర్వత్ర వెల్లువెత్తుతున్నాయి. కొందరు భవన యజమానులు, మరి కొంతమంది రాజకీయ పార్టీలకు చెందిన చోట మోటా నాయకులు పాదచారులు రాకపోకలు సాగించడానికి జిహెచ్ ఎంసి ఏర్పాటు చేసిన ఫుట్ పాత్‌లను బహిరంగంగా అద్దెకిస్తూ డబ్బులు దండుకుంటున్నట్లు విమర్శలు న్నాయి. డివిజన్ లోని అజాం కాంప్లెక్స్, అయ్యప్ప టెంపుల్, రెడ్ బిల్డింగ్, ఆర్.కె నగర్, మల్లికార్జున్ నగర్ తదితర ప్రాంతాల్లో యజమానులు తమ భవనాల ముందు ఉన్న ఫుట్ పాత్ లను తోపుడుబండ్ల వ్యాపారులకు అద్దెకిస్తూ రోజుకు ఐదు వందల నుంచి వెయ్యి రూపాయల వరకు అద్దె వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా ఏటిఐ ప్రహరీ గోడ, హెటల్ మేనేజ్మెంట్ కాంప్లెక్స్, ఆంధ్ర బ్యాంక్ చౌరస్తా, మోహిన్ చెరు తదితర ప్రాంతాల్లో కొంతమంది రాజకీయ పార్టీలకు చెందిన చోటా మోట లీడర్లు ఫుట్ పాత్ లను అద్దెకిస్తూ చిరు వ్యాపారుల నుండి ప్రతినెల మూడు వేల నుండి ఐదు వేల వరకు ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఆజాం కాంప్లెక్స్ వద్ద కొత్త భవనాన్ని నిర్మించిన యజమాని గప్ చుప్, ఇడ్లీ బండి వ్యాపారులకు ఫుట్ పాత్ ను అద్దెకిచ్చి వారి నుండి నుండి ప్రతినిత్యం వెయ్యి రూపాయలు అద్దె వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విధంగా బాగ్ అంబర్ పేట్ డివిజన్ లో ఫుట్ పాత్ ల ఆక్రమణ యదేచ్ఛగా కొనసాగుతుండడంతో పాదచారుల రాక పోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆరోపించారు. ఫుట్ పాత్ లపై అక్రమ వ్యాపారాలు కొనసాగుతుండడంతో పాదచారులు రోడ్డుపై నడిచే క్రమంలో ప్రమాదాలు జరుగు తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో బహిరంగంగా ఫుట్ పాత్ లా అక్రమణలు జరుగుతున్నా, ఇటు జిహెచ్ఎంసి ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది గాని, అటు ట్రాఫిక్ పోలీసులు గానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రతినెల ఫుట్ పాత్ వ్యాపారుల నుండి ఎన్ఫోర్స్మెంట్ సిబ్బందికి, ట్రాఫిక్ పోలీసులకు మామూళ్లు అందుతుండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి, ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



## ప్రభాకర్‌ను పరామర్శించిన ఈటల

**రామంతాపూర్, ఆగస్టు 11(నిఘా న్యూస్):** ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ నివాసానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ విచ్చేసి ప్రభాకర్ ను పరామర్శించారు. ఇటీవల కాలికి గాయమై విశ్రాంతి తీసుకుంటున్న ప్రభాకర్ ను ఈటల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రామంతపూర్ కార్పొరేటర్ శ్రీవాణి, బిజెపి నాయకులు కుమారస్వామి, చేల్లోజు ఎల్లా చారి తదితరులు పాల్గొన్నారు.



నెరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధి మహిళా పోలీస్. వినూతనంగా సైకిల్ పై పెట్రోలింగ్ చేస్తున్నారు. కాలనీ వాసులను కలిసి జరుగుతున్న నేరాలు, డ్రగ్స్ మత్తు పదార్థాల ప్రభావంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తు జనం నుంచి అభినందనలు పొందుతున్నారు.

– మల్కాజిగిరి ఆగస్టు11 (నిఘా న్యూస్):

## నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ సిస్టంలో మార్పులు చేయాలి

- జీఎస్టీ వే బిల్లు మాదిరిగా ఆన్ లైన్‌లో తీసుకుకోవాలి
- టింబర్ మర్చంట్స్ సామిల్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు రమణయ్య




**హైదరాబాద్, ఆగస్ట్ 11 (నిఘా న్యూస్):** నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ సిస్టంలో మార్పులు చేసి, జీఎస్టీ వే బిల్లు మాదిరిగా ఫార్మ్ పర్మిట్ వెంటనే ఆన్లైన్లో తీసుకొని రావాలని తెలంగాణ టింబర్ మర్చంట్స్ సామిల్ అల్ లైడ్ ఇండస్ట్రీస్ రాష్ట్ర అధ్యక్షుడు చక్కిలం రమణయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాంపల్లిలోని ఫ్యాప్సీ భవన్ లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫార్మ్-□ పర్మిట్ ఆన్లైన్లో వచ్చే వరకు మాన్యువల్ బిల్స్ ఇవ్వాలని కోరారు. సామిల్ రూల్‌లో జీవో 69లో కానీ లేని సిస్టంను, వ్యాపారస్తులు పర్మిట్ ద్వారా ఖరీదు చేసి దిగుమతి చేసుకున్న టింబర్ ను 24 గంటలలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తెలియ జేయాలన్నారు. కలప కోత మిషన్లలో దుగోడ మిషన్ అనుమతి ఇవ్వాలన్నారు. గ్రౌండ్ స్టాక్ అనే అంశాన్ని జీవో 69 నుండి తీసివేయలని అన్నారు. జీవో 69 ప్రకారం లైసెన్సులు రెన్యువల్ చేస్తున్నప్పుడు రాష్ట్రంలోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లు అందరు కూడా మూడు సంవత్సరాలు తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. సామిల్లు లైసెన్సులు రెన్యువల్ అప్లికేషన్‌లో ఫార్మ్-□లో జీఎస్టీ, ఐటి రిటన్స్ అడుగుతున్నారని అన్నారు. వాటిని మినహాయింపు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల కలప వ్యాపారస్తులు టింబర్ డిపోలు సామిల్లులు ఈ సమావేశంలో హాజరై ప్రతిపాదనలను బలపరిచారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా టింబర్ ఫెడరేషన్ అడ్వైజర్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల అధ్యక్షులు కార్యదర్శులు, కోశాధికారులు, జనరల్ సభ్యులు మరియు జనరల్ సెక్రెటరీ గోపికృష్ణ, ట్రెజరర్ పురుషోత్తం పటేల్ పాల్గొన్నారు.

## థాయిలాండ్ వేదికపై మెరిసిన చిహ్నిక



**విశాఖపట్నం, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** ప్రపంచ దేశాల పిల్లల మధ్య జరిగిన మోడలింగ్ పోటీల్లో విశాఖకు చెందిన చిన్నారి ప్రతిభను చాటింది. విశాఖ నగరంలోని గాజువాక ప్రాంతానికి చెందిన ఏడేళ్ల చిహ్నిక అనే చిన్నారి థాయిలాండ్ దేశంలో జరిగిన పోటీల్లో భారతదేశం తరుపున తన ప్రతిభను కనబరిచి విజేతగా నిలిచింది. 15 దేశాల నుంచి చిన్నారులు పాల్గొన్న ఈ పోటీల్లో న్యాయ నిర్ణేతలను ఆశ్చర్యపరిచేలా చిహ్నిక తన విశేష ప్రతిభాపాటవాలు ప్రదర్శించి థాయిలాండ్ వేదికపై విజయ డంకా మోగించింది.

## ప్రాణాలను కాపాడిన పోలీసులు



**నారాయణపేట, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ గొండ గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి భార్యాభర్తల మధ్య గొడవతో రాజు మద్యం మత్తులో ఉండి పురుగుల మందు డబ్బాలతో గ్రామ శివారులోని ఒక గుట్ట పైకి వెళ్లి భార్య మాధవి కి కాల్ చేసి నేను పురుగుల మందు తాగి చనిపోతున్నానని చెప్పడంతో కంగారు పడిన భార్య వెంటనే డయల్ 100కాల్ చేయగా రూరల్ డయల్ 100 పోలీసులు ఏఎస్ఐ బాలయ్య, కానిస్టేబుల్ ఆనంద్ వెంటనే అప్రమత్తమై నూతన సాంకేతిక వ్యవస్థ ఆధారంగా రాజును గుర్తించి తీసుకెళ్లి గ్రామ పెద్దలు, అతని భార్య మాధవి లకు అప్పగించి భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగింది. గ్రామస్తులు, భార్య మాధవి పోలీసులకు కృతజ్ఞత తెలిపారు.

## అమరుల యాధిలో గీతన్నల చైతన్య యాత్ర

- కాటమయ్య స్ఫూర్తితో కల్లుగీత వృత్తిలో ఉపాధికై ఉద్యమిస్తాం
- కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ



**మల్కాజిగిరి,ఆగస్టు11 (నిఘా న్యూస్):** నాడు నరరూప రాక్షసులను సంహరించి తాటి ఈత వనాన్ని కాపాడిన కాటమయ్య స్ఫూర్తితో నేడు వన సంరక్షణకై ఉద్యమిస్తామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ అన్నారు. ఆగస్టు 2 న ప్రారంభమైన అమరుల యాధిలో గీతన్నల చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం మల్కాజిగిరిలో యాది సభ జరిగింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు వి వెంకట నరసయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథిగా ఎం.వి రమణ పాల్గొని ప్రసంగించారు. కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేసి అమరులైన నాయకులందరినీ యాది చేసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా యాత్రలు చేస్తున్నామని ఆగస్టు 18న సర్వాయి పాపన్న జయంతి నాడు ముగిస్తామన్నారు. భూములకు ధరలు పెరగడంతో యజమానులు తాటి ఈత చెట్లను నరికి వేస్తున్నారని దీనివలన గీత కార్మికులు ఉపాధి కోల్పోవడంతో పాటు పర్యావరణం దెబ్బతింటుందన్నారు. చెట్లను తొలగించడం చట్ట ప్రకారం నేరం అన్నారు. ప్రతి సొసైటీకి 5 ఎకరాల భూమి ఇవ్వాలనే 560జీవో అమలు చేయాలని, ప్రభుత్వ భూమి లేనట్లయితే కొని ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వృత్తిలో ప్రమాద నివారణకు కాటమయ్య రక్షణ కవచం పేరిట రాష్ట్ర ప్రభుత్వం సేఫ్టీ కిట్టులు ఇవ్వడం అభినందనీయం అన్నారు. ఇవి వృత్తి చేసే వారందరికీ ఇవ్వాలని సూచించారు. గీత కార్మికులకు కేటాయించిన బడ్జెట్ తో నక్లెస్ రోడ్ లో నిర్మించిన నీరా కేఫ్ ను టూరిజం శాఖ నుండి తొలగించి టాడి కార్పొరేషన్‌కి అప్పగించాలని తద్వారా గీత కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఆగస్టు 18న సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ట్యాంక్ బండ్ పై పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో గీత కార్మికులకు ప్రకటించిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి కప్పల లింగం గౌడ్ మాట్లాడుతూ వృత్తి చేసే వారందరికీ సభ్యత్వము గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో నీరా తాటి ఉత్పత్తుల పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. సీనియర్ నాయకులు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గౌడ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు చింతల మల్లేశం గౌడ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం పార్టీలకతీతంగా ఐక్యంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జీడి బాలచందర్ గౌడ్, జీడి సంపత్ గౌడ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి కప్పల లింగం గౌడ్, అంబాల శ్రీనివాస్ గౌడ్, సట్ల ప్రభాకర్ గౌడ్,మేకపోతుల కృష్ణ గౌడ్, వేణుగోపాల్ గౌడ్, పంజాల యాదగిరి గౌడ్, రామకృష్ణ గౌడ్, జనగాని రాజు గౌడ్ నాతి మహేష్ గౌడ్, మెరుగు జంగయ్య గౌడ్, బూడిద కృష్ణ మూర్తి ఆ బూడిద కృష్ణమూర్తి, బూడిద రాకేష్ గౌడ్, దొంతి అంజయ్య గౌడ్, దుమ్మడ శ్రీశైలం గౌడ్, దేశం అనిత గౌడ్, రాంపల్లి సుధా గౌడ్, బాల్నేని శ్రీలత గౌడ్, డి లక్ష్మణ్ గౌడ్, పి సుభాష్ గౌడ్, సుదగాని రమేష్ గౌడ్, ఆకుల రమేష్ గౌడ్, తోకల నరేందర్ గౌడ్, జిల్లా కల్లుగీత కార్మిక సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూసుగూడెం పంప్ హౌస్... ట్రయిల్ రన్ విజయవంతం



**అశ్వారావుపేట, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** తెలంగాణా రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఈనెల 15న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్న సీతారామ ప్రాజెక్ట్ లో కీలకమైన పంప్ హౌస్ ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరైయ్యారు. ట్రయల్ రన్ విజయవంతం కావడం పట్ల మంత్రుల బృందం ఆనందం వ్యక్తం చేసింది. పూసుగూడెం పంప్ హౌస్ వద్ద మొత్తం ఆరు బాహుబలి మోటార్లు బిగించగ ఒక్క పంప్ ద్వారా 15వేల క్యూసెక్కుల గోదావరి నీటిని ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా వైరాకు అందించనున్నారు.. పూసుగూడెం పంప్ హౌస్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు తుమ్మల ,పొంగులేటి,ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీపై మంత్రులు విమర్శలు గుప్పించారు. గతంలో 8వేల కోట్ల రూపాయల ఖర్చు పెట్టీ తల తోక లేని పనులు చేపట్టారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ హయంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీతారామ ప్రాజెక్ట్ లోని మెయిన్ కెనాల్ ను పూర్తి చేయటం ద్వారా ఈ ఏడాది నాగార్జున సాగర్ ఆయకట్టు కు కృష్ణ జలాలు రాకున్నా గోదావరి జలాలు అందించవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఈ మూడు పంప్ హౌస్ లు వినియోగంలోనికి తీసుకురావటం ద్వారా లక్ష ఇరువై వేల ఎకరాలకు నీరు అందించనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్యదీక్షతోనే ఉన్నత శిఖరాలు సాధ్యం

- ఎంబీయూలో ఘనంగా స్నాతస్ కోత్సవ, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు
- హాజరైన ఉపముఖ్యమంత్రి బట్టి మోహన్ బాబు






**చంద్రగిరి, ఆగస్టు 11(నిఘా న్యూస్):** దేశంలోనే విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యను అందించడంలో మోహన్ బాబు విశ్వవిద్యాలయం అగ్రగామిగా ఉండడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మండలంలోని ఏ. రంగంపేట సాయి నగర్‌లోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో మొదట స్నాతకోత్సవ, శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజ్ 13వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విక్రమార్క, ఛాన్సలర్, డాక్టర్ ఎం.మోహన్ బాబు,సినీ నటుడు మంచు విష్ణువులు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల కార్యదీక్షతో ఉన్నత శిఖరాలకు ఎదిగి, స్థాయిని, హోదాను పక్కన పెట్టి పదిమందికి ఉపయోగపడేలా జీవితాన్ని మలుచుకోవాలని సూచించారు. ఎంబియూ ఛాన్సలర్ డాక్టర్ మంచు మోహన్ బాబు సినీ, విద్యారంగంలో కూడా నైపుణ్యాన్ని సాధించి అగ్రస్థానాన్ని సాధించడం గొప్ప విషయం అన్నారు. సేవా దృక్పథంతో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించి విద్యనందించడం అభినందనీయమన్నారు. మోహన్ బాబు విశ్వవిద్యాలయం ఛాన్స్ లర్, డాక్టర్ మంచు మోహన్ బాబు మాట్లాడుతూ 32 సంవత్సరాల కృషి ఫలితమే నేడు శ్రీ విద్యానికేతన్ విద్యా సంస్థలు యూనివర్సిటీ స్థాయికి చేరుకున్నాయని పేర్కొన్నారు. తన తల్లిదండ్రులు, తన గురువు దాసరి నారాయణ రావు ఆశీస్సులతోనే ఈ స్థాయికి ఎదిగానని తెలిపారు. ముఖ్యఅతిథి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క పేద బడుగు బలహీనవర్గాల అశా జ్యోతి అని మోహన్ బాబుని ఆయన కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథులు ఎంబియూ, శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజీలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన పట్టభద్రులకు డిగ్రీ పట్టాలను పంపిణీ చేసి అభినందనలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రొ. ఛాన్స్ లర్ మంచు విష్ణు, ఉపకులపతి నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ సారధి, డీన్లు, ఆచార్యులు, అధ్యాపకులు, ఎంబీయూ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇల్లందులో యాదవ చైతన్య సదస్సు



**ఇల్లందు, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** ఇల్లందు పట్టణంలోని మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో యాదవ మహాసభ చైతన్య సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిసిసిబి జిల్లా మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం యాదవ్ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాల్లో యాదవులు ఐక్యంగా ముందుకెళ్లాలన్నారు. యాదవులు తమ పిల్లలకు ఉన్నత విద్యను అందిస్తే సమాజంలో చైతన్య వంతులు అవుతారని తెలిపారు. రాష్ట్రంలో యాదవుల జనాభా ప్రకారంగా యాదవ సంఘాలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇల్లందు పట్టణంలో యాదవ సంఘం కార్యాలయం భవనంకు నిధులు మంజూరు అయ్యాయని నిధులను సాధించడంలో కొంత వైఫల్యం జరగడం వాస్తవమేనని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇంత పెద్ద స్థాయిలో యాదవులు హాజరు కావడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు నాగ సీతారాములు నాగరాజు యాదవ్ మెట్టెల కృష్ణ పెదబోయిన ఉమ శంకర్ మేకల మల్లేష్ సుంకర బోయిన సత్యనారాయణ బయ్య వరప్రసాద్ జడల వాణి గుగ్గిల యాదగిరి నూకాల మురళి పెరుగు కోటేశ్వరరావు వజ్రములు మద్ది మల్లేష్ వంగూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కావలివారి పల్లెలో పశువుల పండగ

**చంద్రగిరి ఎమ్మెల్యే తనయుడు పులివర్తి వినీల్ హాజరు**



**చంద్రగిరి, 11ఆగస్ట్ (నిఘా న్యూస్):** పాకాల మండలం కావలివారిపల్లి గ్రామంలో గ్రామస్తులు కలిసి ఆదివారం పశువుల పండగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు,యువ నేత పులివర్తి వినీల్ కు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. గ్రామస్తులు శాలువా కప్పి పూలమాలవేసి సత్కరించారు. అనంతరం పశువుల పండుగలో పాల్గొన్నారు. పశువులను నిలువ రించడానికి,వాటికి వివిధ రకాల నేతల ఫోటోలతో కట్టిన పలకలను చేజిక్కించు కోవడానికి యువత పోటీ పడ్డారు. పశువుల పండుగను చూడడానికి చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు, యువత వేలాది మందిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే తనయుడు,యువనేత పులివర్తి వినీల్ మాట్లాడుతూ జల్లికట్టు యువతలో ఎంతో హుషారు కలిగించిందన్నరు. ఇలాంటి సంబరాలు జరుపుకోవడం వలన పల్లెటలకు వర్ణించలేని కోలాహలంతో పాటు ఆహ్లాదం కలుగుతాయని చెప్పారు. జల్లికట్టు వలన మరుగున పడిపోతున్న గ్రామీణ పండుగ సంబరాలను భావితరాలకు అందించవచ్చని తెలియజేశారు. జల్లికట్టును తిలకించడానికి,పశువులను నిలువరించి, బహుమతులను చేజిక్కించుకోవడానికి పలు ప్రాంతాల నుంచి వేలాదిగా యువత తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు,యువత పాల్గొన్నారు.



Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com